# కంకి కొడవలి

# గుర్తుకే మీ ఓటు

సి.పి.ఐ. అభ్యర్థులను

గెలిపించండి

ప్రతులు: 5000

భారత కమ్యూనిస్టు పార్టీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిటి

# ఎన్నికల ప్రణాళిక-2014

మఖ్దూంభవన్
హిమాయత్‌నగర్
హైదరాబాద్ - 500 029

భారత కమ్యూనిస్టు పార్టీ

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిటి

# ఎన్నికల ప్రణాళిక-2014

మఖ్దూంభవన్
హిమాయత్‌నగర్
హైదరాబాద్ - 500 029

ప్రచురణకర్త: డా॥ కె. నారాయణ, కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి, మఖ్దూంభవన్, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029. ఫోన్: 040-23223338,

ముద్రణ: విశాలాంధ్ర ప్రెస్, బండ్లగూడ(నాగోల్), రంగారెడ్డి జిల్లా - 500 068.
ఫోన్: 040-20062837

# భారత కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ)
# ఎన్నికల ప్రణాళిక-2014

కేంద్రంలో నయా ఉదారవాద విధానాల ఫలితంగా ఆకలి, అధిక ధరలు, నిరుద్యోగం, ఆర్థిక వ్యత్యాసాలు పెరిగిపోతున్నాయి. రెండు దశాబ్దాలుగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్పోరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు పరుస్తున్నారు. జాతీయ మరియు సహజ వనరుల దోపిడి యదేచ్ఛగా కొనసాగుతున్నది. లక్షల కోట్ల రూపాయల విలువ గలిగిన కుంభకోణాలు వెలుగులోకి వస్తున్నాయి. స్కాంలు బహిర్గతమవుతున్నప్పటికి, కార్పోరేట్ అనుకూల ఆర్థికాభివృద్ధి వైపుకే పాలకులు మొగ్గు చూపడం జరుగుతున్నది. కార్పొరేట్ దిగ్గజాలు ప్రజాస్వామ్య, లౌకిక వ్యవస్థను ధ్వంసం చేయడానికి కుట్రపన్నుతున్నాయి. 16వ లోక్ సభ ఎన్నికల సందర్భంలో దేశం లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థ, ఆర్థిక స్వావలంబనకు అనేక సవాళ్ళను ఎదుర్కొంటున్నది.

ప్రస్తుతమున్న మిశ్రమ ప్రభుత్వ స్థానములో ఎన్నికల తదనంతరం మరొక మిశ్రమ ప్రభుత్వం ఏర్పడనున్నది. అయితే నయా ఉదారవాద విధానాలు మరియు ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాల మధ్య ఎవరిని ఎన్నుకోవాలన్నది ప్రజల ముందున్న అసలు సమస్య.

అవినీతి ఆరోపణల నెదుర్కొని గత ప్రభుత్వంలోని అరడజను మంత్రులు తమ పదవుల నుండి వైదొలిగాల్సివచ్చింది. 1.75 లక్షల కోట్ల రూపాయల నిలువగలిగిన 2జీ స్కాంలో నిందితునిగా ఒక మంత్రి వర్యులు కటకటాలు లెక్కపెట్టాల్సి వచ్చింది. ఒకరిద్దరు మంత్రులను కార్పొరేట్, అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి అనుకూల వైఖరి తీసుకోనందుకు తొలగించడం జరిగింది. లక్షా 80 వేల కోట్ల రూపాయల కుంభకోణంలో స్వయాన ప్రధానమంత్రి మన్‌మోహన్ సింగ్ ఇరుక్కోవడం దేశానికే సిగ్గుచేటు.

సామ్రాజ్యవాద, నయా ఉదారవాద, కార్పోరేట్ అనుకూల విధానాలను అమలు పర్చేందుకు యుపిఏ-11 బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏలు చేతులు కలిపాయి. 15వ లోక్‌సభ తన సమయానంత వృధా చేసింది. అనేక సామాజిక ఆర్థిక అంశాలను చర్చించేబదులు వివాదాలతో కాలయాపన చేసింది. దేశ ప్రధాన అర్థవంతమైన మౌలిక అంశాలను చర్చించకుండా రెండు బూర్జువా పార్టీలు దాటవేశాయి. అత్యంత లాభాల వేటలో ప్రభుత్వాన్ని కార్పోరేట్ పెట్టుబడి లొంగదీసుకొని ఆర్థిక సంక్షోభం వైపుకు మరింత నెట్టింది. 2008 నుండి నిత్య జీవితావసర వస్తువుల ధరలు రెట్టింపు అయ్యాయి. అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదికల మేరకు అత్యధిక నిరుద్యోగులు కలిగిన దేశాల లిస్టులోకి భారత్ చేరి పోయింది. సమర్థత కలిగి, ఉద్యోగార్హత కలిగిన వారిలో 4% మంది నిరుద్యోగులుగా కొనసాగుతున్నారు. మూసివేతలు ఔట్‌సోర్సింగ్, కంట్రాక్టీకరణ ఫలితంగా ప్రస్తుతమున్న

నిరుద్యోగులకు వేలాది మంది జతచేరుతున్నారు. ప్రభుత్వంలోకి అనేక శాఖలలో కొత్త రిక్రూట్‌మెంట్ పై నిషేధం పెట్టడం జరిగింది. ప్రభుత్వ రంగ సంస్థలు ఔట్‌సోర్సింగ్‌ను ఎంచుకోవాల్సి వస్తుంది. కొత్త ఉద్యోగాలు ప్రభుత్వం తరపున సృష్టించబడటం లేదు. ట్రేడ్ యూనియన్ హక్కులు కాలరాయబడుతున్నాయి. అనేక రంగాలు, జోన్లు కార్మిక సంఘాల హక్కుల పరిధి అవతలకు నెట్టబడుతున్నాయి.

జాతీయ, సహజ వనరుల దోపిడి యుపిఏ-2 ప్రభుత్వం సాధించిన మరొక అంశం లాభాలు గడిస్తున్న ప్రభుత్వరంగ సంస్థల వాటాలను ప్రైవేట్ రంగానికి అప్పనంగా అతి చౌక ధరలో అమ్మడం వల్ల లోటు బడ్జెట్ పూడ్చడానికి గృహ అవసరాల వెండిని సైతం అమ్మాల్సివచ్చింది. దేశ సహజ సంపదను ప్రైవేటు రంగానికి అమ్మేసింది. గ్యాస్‌ను వెలికి తీసెందుకు నిర్ణయించే ధరను రెట్టింపు చేయడంలో ముఖేష్ అంబానితో ప్రభుత్వం చేతులు కలిపి సహజ వనరుల దోపిడి, వారికి గరిష్ట లాభాలు తెచ్చిపెట్టడం అతి పెద్ద కుంభకోణం. నయా ఉదారవాద విధానాల ఫలితంగా ఆర్థిక వ్యత్యాసాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం కోటీశ్వరుల సంఖ్యలో భారతదేశం అగ్రస్థానాన్ని ఆక్రమించుకొంది. దారిద్ర్యరేఖ దిగువన ఉన్నవారి సంఖ్య కూడ భారతదేశంలోనే అధికంగా ఉంది. రోజుకు కనీసం రూ.20/- కూడా ఖర్చు పెట్టలేని వారి సంఖ్య 70% పైగా ఉన్నారు.

ప్రజల ప్రజాస్వామ్య హక్కులను హరించే విషయంలో సైతం భారతదేశానికే పేరుంది. ముస్లిం మతస్థులను నాగరికత ప్రమాద చిహ్నాలుగా వర్ణిస్తూ "నాగరికతల మధ్య ఘర్షణ" అనే అమెరికా సిద్ధాంతాన్ని జీర్ణించుకొన్న వాజ్‌పేయి నాయకత్వంలోని ఎన్‌డిఏ విధానాలనే యుపిఏ-2 అమలుపరుస్తుంది. ప్రాథమిక విచారణ నివేదికలను సైతం సమర్పించకుండా వందలాది మంది ముస్లిం యువకులను కటకటాల వెనుకకు తోసేయడం జరుగుతున్నది. ప్రజల ప్రజాస్వామ్య హక్కులను హరించేందుకు టాడా లాంటి నల్లచట్టాలను రూపొందించడం జరుగుతున్నది.

విదేశాంగ విధానంలో అమెరికా సామ్రాజ్యవాదుల ఒత్తిళ్ళకు లొంగిపోవడం జరుగుతున్నది. అమెరికా సామ్రాజ్యవాదుల ఒత్తిడికి ఇరాన్-పాకిస్తాన్- భారత్‌గ్యాస్ పైప్ లైను వేసే విషయంలో వెనుకకు తగ్గడం జరిగింది. మన జాతి ప్రయోజనాలను ప్రక్కకు పెట్టి అంతర్జాతీయ ఆర్థిక-రాజకీయ వేదికలపై సామ్రాజ్యవాదులతో కుమ్మక్కు కావడం జరుగుతున్నది. ప్రపంచ వాణిజ్య సంస్థలో అమెరికాను సంతృప్తి పరిచేందుకు బ్రెజిల్-రష్యా-ఇండియా-చైనా- సౌతాఫ్రికా బ్రిక్స్ ఉమ్మడి అభిప్రాయాలకు వ్యతిరేకంగా యుపిఏ తన అభిప్రాయాలను వెల్లడిస్తోంది. సిరియా, ఇరాన్ అణ్వాయుధాలు కలిగి వుండటం అనే అంశాలలో యుపిఏ సామ్రాజ్య వాదులకు లొంగి పోవడ మనేది బహిర్గతమవుతూనే ఉంది.

కార్పోరేట్ పెట్టుబడి, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిల ప్రభుత్వంగా, వారిచే ఎన్నుకోబడిన, వారి కోసం ఎన్నుకోబడిన ప్రభుత్వంగా నిరూపించబడింది.



ప్రస్తుతం కార్పోరేట్ పెట్టుబడి, అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి యుపిఏ-2 నుండి రాబట్టుకోవాల్సిన లాభాలను సేకరించి, 2002 నుండి ప్రజల రక్తాన్ని చవిచూసిన ప్రధాన మంత్రి అభ్యర్థి, అధికార అహంబావ పూరిత నరేంద్రమోడి వైపు మొగ్గుచూపుతున్నాయి. రోజులు గడుస్తున్న కొద్ది గుజరాత్ నమూనా ప్రభుత్వంలోని డొల్లతనం బహిర్గతమవుతుంది. ఆయన ప్రభుత్వం బడా పెట్టుబడి దారి వర్గానికి ప్రాతినిధ్యం వహించేది అని స్పష్టమవుతుంది. రైతులను భూముల నుండి బేదఖల్ చేసి దేశంలోనే వ్యవసాయ భూములు కుచించుకుపోవడంలో నేడు గుజరాత్ మొదటి స్థానంలోనే వుంది. పారిశ్రామికీకరణ పేరిట సేకరించిన వ్యవసాయ భూములను బిల్డర్స్ మాఫియాకు అప్పచెప్పింది. జాతి రక్షణకై కచ్ సరిహద్దు ప్రాంతాలలో స్థిరపడిన సిక్కు రైతులను సైతం భూముల నుండి తొలగించి ఆ జిల్లాలో ఇప్పటికే రెండు నౌకాశ్రయాలు కలిగిన అదాని గ్రూపు ప్రయోజనాలు కాపాడేందుకు మోడి ప్రభుత్వం పూనుకొంది. ముస్లిం మైనారిటీలు నివసించే ప్రాంతాలను అధ్వాన్నంగా మార్చడం పూర్తయింది. రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులను సైతం ఖాతరు చేయకుండా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక వనరులు సమకూర్చేటువంటి మైనారిటీల కోసం సామాజిక- ఆర్థిక, విద్యాపరమైన సంక్షేమ పథకాలను అమలు చేయడానికి మోడి ప్రభుత్వం తిరస్కరించింది.

కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు పరిచేందుకు లౌకిక, ప్రజాస్వామిక వ్యవస్థపై మోడి ప్రభుత్వం దాడి చేస్తోంది. ఓటర్లలలో మతపరమైన విభజన సాధించేందుకు బిజెపి చేయాల్సిన ఎత్తుగడలను వేస్తోంది. ఈ పథకంలో ముజఫర్‌నగర్ మంచి ఉదాహరణ.

ఈ ప్రత్యేక పరిస్థితులలో దేశ ఆర్థిక స్వావలంబన కాపాడటంలో, ప్రజా అనుకూల ప్రత్యామ్నాయ విధానాలు అవలంబించడానికి ఈ ఎన్నికలు తీర్పునివ్వాలి. అభివృద్ధి ఫలాలు ప్రజలలోని అన్ని వర్గాలకు అందాలి. నయా ఉదారవాద ప్రమాదభరితమైన ఆర్థిక వ్యవస్థను అవలంబించే ప్రధాన బూర్జువా పార్టీలైన ఎన్‌డిఏ, యుపిఏలకు చెంపపెట్టు కావాలి. ఆహార భద్రత, సామాజిక భద్రత, విద్య, ఉద్యోగాలు, ప్రజారోగ్యం అందరికి కల్పించేటువంటి ప్రజాస్వామ్యం లౌకిక వ్యవస్థను కాపాడేటువంటి ప్రభుత్వం ఎన్నుకోబడాలి.

"ఆశ్రిత పెట్టుబడి దారి విధానం"ను కేవలం పడికట్టు పదాలతో మాత్రమే విమర్శిస్తే సరిపోదు. కావల్సిందల్లా సామాజిక- ఆర్థిక ప్రత్యామ్నాయ కార్యక్రమం. దీన్ని వామపక్షాలు మాత్రమే రూపొందించి అమలు చేయగలవు. గత రెండు దశాబ్దాలలో భారతదేశం మిశ్రమ ప్రభుత్వాల యుగంలో ప్రవేశించింది. అయితే కేంద్రప్రభుత్వ పని విధానంలో వామపక్షాల మాట రెండు సార్లు చెల్లుబాటైంది. 1996లో ఐక్య సంఘటన ప్రభుత్వంలో సిపిఐకి కేంద్ర మంత్రివర్గంలో ఇద్దరికి మంత్రి పదవులుదక్కాయి. పారదర్శక-ప్రజానుకూల పాలన అందించేందుకు మొదటిసారిగా కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగింది.

బయటి నుండి మద్దతు ఇచ్చిన వారు ఐక్య సంఘటన ప్రభుత్వంలో మద్దతు ఉపసంహరించుకొంటామని బెదిరింపులు చేస్తున్న నేపథ్యంలో సైతం ఐదవ వేతన సంఘం ప్రతిపాదనలను ప్రభుత్వం చేత సిపిఐ ఒప్పించింది. పోలీసు సంస్కరణలు తీసుకురావడానికి

చొరవ చేశాం. వ్యవసాయ రంగంలో పంటల బీమా పథకంతో పాటు అనేక విషయాల్లో సిపిఐ చొరవ చూపెట్టింది.

యుపిఏ-1 ప్రభుత్వ హయాంలో వామపక్షాల కనీస ఉమ్మడి కార్యక్రమం అమలుకై ముఖ్యంగా గ్రామీణ ఉపాధి హామి పథకం, అటవీ సంపదపై అటవి పుత్రుల హక్కుల కోసం, గృహహింసకు వ్యతిరేకంగాను, సమాచార హక్కు కోసం, చట్టాలు చేయడంతో బాటు ముస్లిం మైనారిటీల దయనీయమైన పరిస్థితులపై సచార్ కమిటీ, రంగనాథ్ మిశ్రా కమిషన్ల ప్రతిపాదనలను ముందుకు తీసుకువచ్చింది. నిత్య జీవితావసర వస్తువుల ధరల పెరుగుదలకు, అలాగే పెట్రోల్, డీజెల్, కిరోసిన్, గ్యాస్ ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ఎప్పటికప్పుడు పోరాటాలు చేస్తు వచ్చింది. ముఖేష్ అంబానికి లాభాలు తెచ్చిపెట్టేందుకు కృష్ణా-గోదావరి గ్యాస్ బేసిన్‌లో గ్యాస్ వెలికితీత ధరలను రెట్టింపు చేయడాన్ని, అలాగే కార్పోరేట్ సంస్థలకు రాయితీలకు అలాగే విదేశాంగ విధానంలో అమెరికా అనుకూల మొగ్గు చూపడానికి వ్యతిరేకంగా సిపిఐ అనేక పోరాటాలను నిర్వహించింది.

రాజకీయ దివాళా కోరుతనానికి, ఆర్థిక అస్తవ్యస్త విధానాల నుండి దేశాన్ని రక్షించేందుకు గాను బలోపేతమైన వామపక్ష సంఘటన 16వ లోక్‌సభలో ఏర్పాటు అత్యంత ఆవశ్యకతతో కూడుకున్నది. నయా ఆర్థిక ఉదారవాద విధానాలను పూర్తిగా ప్రతి ఘటించగలిగేది వామపక్షం మాత్రమే. వామపక్షానికి ప్రత్యామ్నాయ సామాజిక-ఆర్థిక విధానాల దృక్పథం కలిగివున్నది. ఢిల్లీలో 2013 జులై 1వ తేదీన జరిగిన సదస్సులో ఈ మేరకు ఆర్థిక విధాన ప్రకటన చేయడం జరిగింది. రానున్న ఎన్నికలలో ప్రాంతీయ పార్టీల, నూతన పార్టీల ఆవిర్భావం వల్ల ఓటర్లు వివిధ రకాలుగా చీలనున్నారు. అంటే రానున్నది మిశ్రమ ప్రభుత్వాల యుగమనేది స్పష్టమవుతున్నది.

అందువల్ల యుపిఏకు, బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏకు ప్రత్యామ్నాయంగా రాజకీయ పార్టీలను, ప్రాంతీయ సెక్యులర్ పార్టీలను సమీకరించాల్సివుంది. ఈ కర్తవ్యాన్ని పరిపూర్తి చేయడానికి రానున్న లోక్‌సభలో బలోపేతమైన వామపక్ష సంఘటన అవసరం భారత దేశాన్ని ఆర్థిక అస్తవ్యస్తం నుండి రక్షించేందుకు, లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఈ కర్తవ్యాన్ని వామపక్షాలు మాత్రమే పరిపూర్తి చేయగలవు. చేయాలి. వామపక్షాల కార్పొరేట్ సంస్థల వ్యతిరేక వైఖరిని గమనించిన కార్పొరేట్ సంస్థలు వామపక్షాల బలాన్ని తగ్గించేందుకు, ప్రత్యామ్నాయ కార్యక్రమాన్ని దెబ్బతీసేందుకు అన్ని విధాల ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రాంతీయ, లౌకిక పార్టీలను కార్పొరేట్ సంస్థలు తప్పుదోవ పట్టిస్తున్నాయి. ఈ పూర్వరంగంలో పార్లమెంటు ఎన్నికలను వ్యక్తుల మధ్య సంఘర్షణగా సృష్టించే కుట్రలను భగ్నం చేయాలి. అందుకోసం సామాజిక-ఆర్థిక అంశాలను ముందుకు తీసుకురావాల్సివుంది.

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి వామపక్షాలు ముఖ్యంగా సిపిఐ ప్రజా సమస్యలపై పార్లమెంటులోపల,వెలుపలా ప్రజా పోరాటాలను నిర్వహిస్తోంది. పార్లమెంటులో బలం కొద్దిగా ఉన్నప్పటికి ప్రజలకు అనుకూలంగా ప్రభుత్వ విధానాలను మలచడంలో పార్లమెంటు బయట



పోరు చేస్తున్న ప్రజల సమస్యలను ప్రతిబింబించడంలో విజయవంతమైంది. ఆర్థిక స్వావలంబనను కాపాడటంలో, ప్రజల జీవన పరిస్థితులను మెరుగుపరచడంలో, వసతి, విద్య, ప్రజారోగ్య హక్కులు కల్పించడంతో పాటు లౌకిక, ప్రజా స్వామ్య వ్యవస్థను పరిరక్షించడంలో వామపక్షాలు సంఘటిత, సుదీర్ఘ పోరాటాలను చేయాల్సివుంది. అందువల్ల 16వ లోక్‌సభలో వామపక్షాలకు మరింత బలం అవసరం.

**బలోపేతమైన వామపక్ష సంఘటన 16వ లోక్‌సభకు ఎంతో అవసరం వుంది.**
**వామపక్షాలను గెలిపించండి..**
**సిపిఐ అభ్యర్థులకే మీ ఓటు...**

పూర్వ ఆంధ్ర ప్రదేశ్‌లో గత ప్రభుత్వాలు నిత్యజీవితావసర వస్తువుల ధరలను నియంత్రించలేకపోయాయి. గత సంవత్సరకాలంలో 25% ధరలు పెరిగాయి. మనరాష్ట్రంలో రూపాయికి కిలో బియ్యం అందజేస్తున్నప్పటికీ పప్పులు, కూరగాయలు, చింతపండు, ఉల్లిగడ్డ, మిర్చి, నూనెల ధరలు విపరీతంగా పెరిగి, సగటుజీవి నడ్డివిరుస్తున్నాయి. ముఖ్యంగా ఫార్వర్డ్ ట్రేడింగ్‌ను ప్రభుత్వాలు ఆపలేకపోయాయి. అక్రమ నిల్వలను అరికట్టలేకపోయాయి. బిజెపి హయాంలో బ్లాక్‌మార్కెటీర్లకు అనుకూలంగా నిత్యజీవితావసర వస్తువుల చట్టాన్ని సవరించింది. దాన్నే యుపిఏ ప్రభుత్వం కొనసాగిస్తోంది.

యుపిఏ అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగినప్పుడల్లా పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలెండర్, కిరోసిన్ ధరలు పెంచేసింది. కస్టమ్స్ సుంకం, ఎక్సైజ్ టాక్సులు పెంచేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సొమ్ము చేసుకొన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ బ్యారల్ ధర విపరీతంగా పడిపోయినా పెట్రోల్, డీజిల్ ధరలను నామమాత్రంగానే తగ్గించి చేతులు దులుపుకుంది తప్పితే మూడింతల ధరలు తగ్గించాలనే ఆలోచనే కరువయింది. పెట్రోలియం ఉత్పత్తుల ధరలు తగ్గించి ఉంటే రవాణాఛార్జీలు తగ్గి నిత్యజీవితావసర ధరలు తగ్గివుండేవి. ద్రవ్యోల్బణం పడిపోయింది అని పాలకులు ఎన్ని గొప్పలు చెప్పుకున్నా పప్పులు, నూనెలు, కూరగాయలు, తిండిగింజల ధరలు ఆకాశాన్నంటుతూనే వున్నాయి. బ్లాక్‌మార్కెటింగ్‌ను అరికట్టేందుకు కఠినచర్యలు తీసుకొనేవిధంగా చట్టాన్ని సవరించలేకపోతున్నది. ఈ విషయంలో బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ, ఇటు కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రగతిశీల ఐక్యసంఘటన ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందాయి.

రాష్ట్రంలో సాగుకు లాయకైన లక్షలాది ఎకరాల భూమి వుండగా అందులో కేవలం నామమాత్రంగా పంచి విపరీతమైన ప్రకటనల వెల్లువతో సంతృప్తిపడుతోంది మన రాష్ట్ర ప్రభుత్వం. ఆ భూమి సైతం రాళ్ళు, రప్పలు కలిగిన భూమిని చదును చేసుకొని, తుమ్మలు కొట్టి అతి కష్టంతో సాగుచేసుకొంటున్న భూమికి పట్టాలు ఇచ్చారు తప్పితే మరొకటి కాదు. అలాగే భూ సంస్కరణల అమలుకుద్దేశించబడిన కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను అమలుచేసి నిరుపేదలకు వ్యవసాయ భూములను పంచాలని సి.పి.ఐ. డిమాండ్ చేస్తోంది.

అలాగే కూలిరేట్లు పెంచాలని, వ్యవసాయ కార్మికులకు సమగ్ర శాసనం తీసుకురావాలని, వారికి పక్కా ఇళ్ళకు యూనిట్ విలువ ఒక లక్షకు పెంచాలని సి.పి.ఐ. డిమాండ్ చేస్తున్నది.

ఏ దేశాభివృద్ధికైనా పరిశ్రమల స్థాపన అత్యవసరమే. కాని ప్రపంచంలో ఎక్కడా లేనన్ని ప్రత్యేక ఆర్థిక మండళ్ళ స్థాపన పేరిట భూముల సేకరణ జరుగుతున్నది. పంటలు పండనటువంటి భూముల్లో పరిశ్రమల స్థాపనకు అభ్యంతరం ఎవరికీ వుండదు. కాని సారవంతమైన భూముల్లో, అందులో రెండు పంటలు పండే భూములను సెజ్‌లకెందుకివ్వాల్సి వచ్చింది? దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాలకిచ్చిన అసైన్డు భూములను కార్పొరేట్ సంస్థలకు కేటాయించడం జరుగుతున్నది. పరిశ్రమాధిపతులకు సెజ్‌ల కోసం 15,000 నుండి 30,000 ఎకరాల భూమి ఎందుకు కేటాయించాల్సి వచ్చింది? సెజ్‌లలో పెట్రో కెమికల్ ఫ్యాక్టరీలను తీరప్రాంతంలో స్థాపిస్తే జలచరాలన్ని కాలుష్యం కోరల తాకిడికి మృత్యువాత పడుతున్నాయి. అందువల్ల అక్కడ ప్రతి పారిశ్రామిక వాడలో విధిగా కాలుష్య శుద్ధి కర్మాగారం ఏర్పాటు చేయాల్సి వుంది.

**పెట్రో కారిడార్–సెజ్‌లు:** రాష్ట్ర ప్రభుత్వం కోస్టల్ కారిడార్ జి.ఓ. 34ను, భూ సేకరణను నిలిపివేశామని ప్రకటించాక, విశాఖ జిల్లా భీమిలి నుండి తూర్పుగోదావరి జిల్లా గాదిమొగ్గ వరకు 603 కిలో మీటర్ల మేర పెట్రో కారిడార్ ఏర్పాటును కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. దీన్ని రద్దు చేయాలి. పెట్రో కారిడార్‌కు అనుమతి కోరుతూ పెట్రో కెమికల్, పెట్రో కెమికల్ ఇన్‌వెస్ట్‌మెంటు రీజియన్‌కు సిఫారసు చేసిన రాష్ట్ర ప్రభుత్వ జి.ఓ. 374 రద్దు చేయాలి. సెజ్‌లకు సాగు భూములు కేటాయించరాదు.

బ్యాంకుల నుండి కోటానుకోట్ల రూపాయలు అప్పుగా తీసుకొన్న సంపన్నవర్గాలపట్ల ఉదాసీనత చూపి మూడు లక్షలకోట్ల రూపాయలను నిరర్థక ఆస్తులుగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ సహకారబ్యాంకులకు డబ్బులు కేటాయించి పేద రైతులకు వడ్డీ వ్యాపారస్తుల నుండి ఋణవిముక్తి చేసే చిత్తశుద్ధి మాత్రం పాలకులకు కొరవడింది.

దేశవ్యాపితంగా గుత్త పెట్టుబడిదారులు రియల్ ఎస్టేటు వ్యాపారులు కోట్లాది రూపాయలను తమ అక్రమార్జనను స్విస్‌బ్యాంక్‌కు తరలిస్తున్నారు. వెబ్‌సైట్‌లో వెల్లడించబడిన వివరాల మేరకు 78 లక్షల కోట్ల రూపాయలు ఒక్క భారతదేశంనుండే స్విస్‌బ్యాంక్‌కు తరలినట్లు సమాచారం. ఈ డబ్బంతటిని భారతదేశానికి కనుక తీసుకురాగలిగితే తలసరి ప్రతి ఒక్క పౌరునికి రు. 83000లు అందుతాయి.

సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకు చట్టసభలలో మూడవ వంతు రిజర్వేషన్‌లు కల్పించడంతో అటు ఎన్‌డిఏ, ఇటు యుపిఏ ఘోరంగా వైఫల్యం చెందాయి. మానవతావాద చట్టాలు చేయడానికి వీలుగా అలాగే చట్ట సభలు ప్రశాంతంగా సభా కార్యక్రమాలు హుందాగా నడవడానికి మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలి. అలాగే దేశాభివృద్ధిలో వారిని భాగస్వాములు చేయాలి. మహిళా సాధికారత కల్పించాలి. పావలావడ్డీ ఋణాలు అధిక మొత్తంలో ఇవ్వాలి. డ్వాక్రా గ్రూపులకు రివాల్వింగ్ ఫండ్ సక్రమంగా చెల్లించాలి.



గృహ హింస నిరోధక చట్టాన్ని కచ్చితంగా అమలుచేయాలి. పని స్థలాల్లో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులను నిరోధించడానికి భారతదేశ అత్యున్నత ధర్మాసనం చేసిన మార్గదర్శక సూత్రాలను కచ్చితంగా అమలుచేయాలి. ర్యాగింగ్ నిరోధాన్ని అమలుచేయాలి. హీన సంస్కృతిని అరికట్టాలి. సమాన పనికి సమాన వేతనం కల్పించాలి.

కొత్తగా ప్రభుత్వరంగంలో భారీ పరిశ్రమలు స్థాపించలేకపోయినప్పటికీ పాత కంపెనీలను మూతవేయడమో, ప్రైవేటీకరణకు ప్రయత్నాలు చేయడమో జరుగుతున్నది. రాష్ట్రంలో ఆర్.టి.సి. ఆదాయానికి గండికొట్టడానికి సెట్విన్ బస్సులతోపాటు, ప్రైవేటు బస్సులను ఆర్టీసికి సమాంతరంగా టూరిస్టు బస్సుల పేరిట రెగ్యులర్‌గా తిప్పుతున్న ఆర్టీసికి తీవ్ర నష్టం తెస్తున్నది ప్రభుత్వం. ప్రైవేటు బస్సులను అక్రమంగా ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తే కార్మికులు, ఉద్యోగులు పెద్దయెత్తున ప్రతిఘటించారు. వైద్య సర్వీసుల్లో సైతం ప్రైవేటీకరణ పర్వం కొనసాగుతోంది. చివరికి నోట్లు, నాణేలు ముద్రించబడే మింట్, సెక్యూరిటి ప్రెస్‌లను సైతం కార్పోరీటీకరణ చేశారు. వీటిలో పాక్షిక ప్రైవేటీకరణ ప్రయత్నాలు సాగుతున్నాయి. మునిసిపల్ సర్వీసులు అనేకం ప్రైవేటు సంస్థలకు అప్పచెప్పడం జరుగుతున్నది. ప్రభుత్వ ముద్రణాలయాల పని ప్రైవేటు వ్యక్తులకివ్వడం జరుగుతున్నది. ప్రభుత్వరంగాన్ని అంచెలవారీగా ధ్వంసం చేయడమే పాలకుల ఉద్దేశంగా కనబడుతోంది.

అదే విధంగా హేతుబద్ధమైన ఆదాయపు పన్ను విధానముండాల్సిన అవసరం వుంది. ఈనాడు రాష్ట్ర ప్రభుత్వం సెజ్‌ల నిర్మాణం పేరిట సెజ్‌ల అధిపతులకు 1,75,000 కోట్ల ఆదాయపు పన్ను రాయితీలు కల్పించింది. అలాగే రిజర్వు బ్యాంకు సైతం కట్టుదిట్టంగా పనిచేయాల్సి వుంది. అనేక చిట్‌ఫండ్ కంపెనీలు, ఫైనాన్స్ సంస్థలు, ప్రైవేటు కో-ఆపరేటివ్ బ్యాంకులు మూతపడుతున్నాయి. కచ్చితంగా డిపాజిట్ ఇన్సూరెన్సు వున్న బ్యాంకులనే రిజర్వ్ బ్యాంక్ నియమాలు పాటించే వాటిని మాత్రమే కొనసాగించాలి.

సంఘటితరంగ కార్మికులు, ఉద్యోగులకు సంబంధించి కాలాతీతమైన బోనస్ చట్టాన్ని సవరించాలి. సీలింగ్‌ను ఎత్తివేయాలి. పెరుగుతున్న నిత్య జీవితావసర వస్తువుల ధరల కనుగుణంగా కరువు భత్యం చెల్లించాలి. అలాగే అసంఘటితరంగ కార్మికులకు సంబంధించి, విధిగా రెండు సంవత్సరాల కొకసారి కనీస వేతనాలు పునర్వ్యవస్థీకరించాలి. పెంచిన వేతనాలు అమలుచేయాలి. ఇ.ఎస్.ఐ., పి.ఎఫ్. సౌకర్యం కల్పించాలి. అసంఘటితరంగ కార్మికుని కనీస వేతనం రోజుకు రూ. 150/–గా చెల్లించాలి.

విద్యావంతుల సంఖ్య పెరుగుతున్న కారణంగాను, కార్పొరేషన్లు, పరిశ్రమలు మూతపడుతున్న కారణంగా నిరుద్యోగం పెరిగిపోతోంది. అమెరికాలో వచ్చిన ఆర్థిక సంక్షోభం ఫలితంగా మేధో వలసలు ఆగిపోయాయి. అనేకమంది ప్రవాస భారతీయులు ఇంటిబాట పట్టారు. దీనివల్ల మనదేశంలో ముఖ్యంగా మన రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య ప్రమాదపు టంచులకు చేరే సంకేతాలు కనబడుతున్నాయి. అందువల్ల రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు భారీ ప్రభుత్వ పరిశ్రమలు నెలకొల్పడానికి పూనుకోవాలి. అలాగే నిరుద్యోగులకు రూ. 3000/– నిరుద్యోగభృతి చెల్లించాలి.

## త్రాగునీటి సమస్య

త్రాగు నీటిని ప్రాథమిక హక్కుగా గుర్తిస్తూ భారత దేశ అత్యున్నత ధర్మాసనం తీర్పునివ్వటం జరిగింది. గ్రామీణ ప్రాంతాలలో త్రాగునీరు లభ్యంకాక అనేక మైళ్ళు నడిచి తెచ్చుకొనే పరిస్థితి ఏర్పడింది. భూగర్భ జలాలు సైతం కలుషితమై అనేక వ్యాధులకు గురిచేయడం జరుగుతుంది. ఫ్లోరిన్, ఆర్సెనిక్, సీసం, జింక్ లాంటి రసాయన పదార్థాల నిష్పత్తి భూగర్భ నీటిలో పెరుగుతున్నది. కొన్ని జిల్లాల్లో ఫ్లోరోసిస్ వ్యాధికి ప్రజలు గురికావటం జరుగుతున్నది. మురికి వాడలలో మంచినీటికై తహతహలాడుతున్నారు. వాటర్ ట్యాంకుల సంఖ్య పెంచాలి.

- అందరికి పరిశుభ్రమైన రక్షిత త్రాగునీరు సరఫరా చేయాలి.
- కోకా కోలా లాంటి కార్పోరేట్ కంపెనీలకు, సంస్థలకు కారుచౌకగా నీటి అమ్మకాలను నిషేదించాలి.
- చెరువులు, కుంటలు అన్యాక్రాంతం కాకుండా చూడాలి.
- చెరువులన్నింటిలో పూడికలు తీయించి, పునర్ వ్యవస్థీకరించి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి.

## ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధి - సిపిఐ పాత్ర

రాష్ట్ర విభజన అనివార్యంగా జరిగిపోయింది. భవిష్యత్ కర్తవ్యమేంటి? అదే చర్చిద్దామని రెండు దఫాలు మేధావులు, నిష్ణాతులతో సుదీర్ఘ చర్చలు చేశాం. ఈ క్రింది ప్రతిపాదనలు మీ ముందుంచుతున్నాం.

- కనీసం 2 సంవత్సరాల ముందు నుండి ప్రక్రియ ప్రారంభించి ఉంటే అన్నీ క్రమంగా జరిగి ఉండేవి. కోస్తా-రాయలసీమ ప్రాంతాలకు ఏమేమి కావాలో తీర్మానాలలో పొందుపరచి ఉండాల్సింది. కొన్ని అంశాలు సవరణల ద్వారా ఆమోదించి ఉండాల్సింది. అలా జరగలేదు. రాజ్యసభలో ప్రధాని ఉపన్యాసమే సరిపోతుందని చెప్పినా అది సాధ్యం కాదు. అందుకే విభజన ఆపలేకపోయినా విభజానంతరం సాధించుకునే ప్రయత్నాలు సాగాలి. అభివృద్ధికి కావాల్సిన నిధులను సమకూర్చుకోవాలి. ఉన్న వనరుల్ని సక్రంగా వినియోగించుకోవాలి.

**అంశాలు:** కోనేరు రంగారావు కమిటి భూ సమస్యలపై మంచి అంశాలు పొందుపరచి తీర్మానం చేయడం జరిగింది. దాని అమలుకు పూనుకోవాలి.

- ప్రభుత్వ చర్యలపై, పాలనపై నిరంతర నిఘా విభాగాన్ని ఏర్పాటు చేయాలి. వాచ్ డాగ్‌లాగా పని చేయాలి.
- ఆయా రంగాల అధ్యయనానికి నిపుణులతో ఉప సంఘాలు ఏర్పాటు చేయాలి.
- విద్యుత్ పంపిణీ, సమన్వయాలపై కమిటి వేయాలి.

## సమ్మిళిత అభివృద్ధి (Inclusive Growth)

సమగ్ర అభివృద్ధి అనేది ప్రజల అవసరాలు తీర్చేదిగా ఉండాలి. కూడు-గుడ్డ-గూడు



ప్రజలకు లభించాలి. అభివృద్ధి సమ్మిళిత అభివృద్ధిగా ఉండాలి. సుస్థిరతతో కూడకున్నదిగా, ప్రజల కనీస అవసరాలు తీర్చేదిగా ఉండాలి. పంచాయతీ రాజ్ వ్యవస్థకు సరిపడా నిధులు, అధికారాలు కల్పించాలి. కేరళను పోల్చుకున్నప్పుడు ఆంధ్ర ప్రదేశ్‌లో ఈ నిధుల కేటాయింపు చాలా తక్కువ.

ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చిన రాష్ట్రాలలో సైతం అభివృద్ధి నామమాత్రమే. ఉదాహరణకు జమ్ము-కాశ్మీర్‌లో 58,000 ఉద్యోగాలు, హిమాచలప్రదేశ్‌లో 95,000, ఉత్తరాఖండ్‌లో 1,60,000 ఉద్యోగాలు మాత్రమే లభించాయి. ఈ రాష్ట్రాలలో ప్రభుత్వ పెట్టుబడులు నామమాత్రమే. దీనివల్ల ఎక్సైజ్, ఆదాయపు పన్ను మినహాయింపు 5 సం॥ల వరకు దొరుకుతుంది. ఈ తక్కువ కాలంలో పెద్దగా పరిశ్రమలు రాలేవు. కాబట్టి 10 సం॥ల ప్యాకేజీ ఇవ్వాలి. సబ్సిడీ కొరకు సీలింగ్ ఎత్తి వేయాలి. అలాగే జిల్లాకొక ప్రభుత్వరంగ పరిశ్రమ నెలకొల్పాలి. మధ్యతరహా, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. వీటికి సాంకేతిక పరిజ్ఞానం కల్పించాలి. విద్యుత్, రుణ, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి. చేనేత రంగానికి కొన్ని వస్త్రాలు రిజర్వు చేయాలి. అలాగే చేనేత వస్త్రాలను ప్రభుత్వ రంగం కొనుగోలు చేయాలి. వెనకబడిన జిల్లాలలో ప్రతి జిల్లాకు 1000 కోట్ల ప్యాకేజీ ఇవ్వాలి. చిన్ని తరహా సాగునీటి ప్రాజెక్టులకు, సాగునీటి ప్రాజెక్టులకు కేటాయించిన బడ్జెట్‌లో 30% నిధులు కేటాయించాలి.

మొదటి సంవత్సరం 10 వేల కోట్ల లోటు బడ్జెట్‌ను కేంద్రమే పూర్తి చేస్తుందని హామీ ఇచ్చింది. దాన్ని అమలు చేసుకోవాలి. కానీ రానున్న ఐదు సంవత్సరాలు లోటుబడ్జెట్‌ను కేంద్రమే భరించాలి. అలాగే ప్రైవేటు పరిశ్రమలను ఆకర్షించేందుకు గాను పది సంవత్సరాల "టాక్స్ హాలిడే" ప్రకటించాలి. ఎక్సైజ్, ఆదాయ పన్నుల్లో నూరు శాతం మినహాయింపు ఇవ్వాలి. అలాగే కృష్ణా-గోదావరి బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న గ్యాస్‌లో ఆంధ్ర ప్రదేశ్‌కు న్యాయమైన కోటా నిర్ణయించాలి.

హైదరాబాదు అనుభవాన్ని తీసుకొని కొత్త రాజధానిని వికేంద్రీకరణ దిశలో ఏర్పాటు చేయాల్సి ఉంది. నూతన రాజధాని నిర్మాణానికి అయ్యే ఖర్చు కేంద్రమే భరించాలి. నూతన రాజధానిని అంతర్జాతీయ స్థాయిలో నిర్మించాలి. దీనికి ప్రవాసాంధ్రుల సహాయ సహకారాలు సైతం పొందాలి. నూతన రాజధానికి 25 కిలోమీటర్ల లోపు ఎలాంటి పరిశ్రమలు ఉండకుండా చర్యలు తీసుకోవాలి.

ఆస్తులు, అప్పులు పంపకం విషయంలో ఆర్థిక నిపుణుల, అలాగే ఇతర రాష్ట్రాల విభజన అనుభవాలను పరిగణనలోకి తీసుకోవాలి.

జిల్లాలలో ఒక చోట ఐటి పార్కు, మరొక చోట పార్మాస్యుటికల్ హబ్, ఆయా జిల్లాలలో లభ్యమవుతున్న ఖనిజాల ఆధారంగా పరిశ్రమలు, ఉత్తరాంధ్రలో అటవీ ఉత్పత్తుల ఆధారిత పరిశ్రమలు. అలాగే వ్యవసాయోత్పత్తుల పరిశ్రమలను స్థాపించి రాష్ట్రాన్ని వికేంద్రీకరణ

దిశగా అభివృద్ధి చేయాలి. ప్రతి జిల్లాలో కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఏమ్స్ తరహాలో వైద్యశాలలు, వైద్య కళాశాలలు, జాతీయ స్థాయి పరిశోధనా కేంద్రాలు రక్షణ శాఖ ప్రయోగశాలలు నిపుణుల సలహాలతో ఏర్పాటు చేయాలి.ఐఐటి, ఐఐఎమ్, ఐఐఎస్‌లు వేరు వేరు జిల్లాలలో ఏర్పాటు చేయాలి. వికేంద్రీకరణ దిశలో వ్యవసాయ పరిశోధనా సంస్థలు, అక్వా కల్చర్, పట్టు పరిశ్రమలు ఏర్పాటు చేయాలి.

నీటిపారుదల ప్రాజెక్టులు: భవిష్యత్‌లో జల వనరుల సమస్యపై తెలంగాణ రాష్ట్రంతో వివాదాలు ఏర్పడకుండా సామరస్యంగా శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషించాలి. జలాల విషయంలో రెండు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టె నీచ సంస్కృతి నుండి ఇరు ప్రాంతాల రాజకీయ నాయకులు దూరం కావాలి. కృష్ణా నది మిగులు జలాల ఆధారిత ప్రాజెక్టులను నిర్మించుకోవాలి. అలాగే నికర జలాలను కేటాయించడానికి కృష్ణా-గోదావరి నదుల అనుసంధానమే పరిష్కారం. అలాగే పోలవరం ప్రాజెక్టును నిర్వాసితుల సమస్యను సమాంతరంగా పరిష్కరిస్తూనే నిర్మించాలి. అన్ని రకాల ప్రాజెక్టులలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు వారు కోల్పోయిన భూమికి భూమినే పరిహారంగా ఇవ్వాలి. నిర్మాణంలో ఉన్న అన్ని నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేయ్యాలి.

ఉత్తరాంధ్రలోని పెండింగ్ నీటి పారుదల ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయడానికి వీలుగా ఒరిస్సా ప్రభుత్వంతో ఉన్న వివాదాలు సామరస్యంగా పరిష్కరించాలి.

అన్నింటి కంటె మించి నదులను, కాలువలనుపయోగించి హైడ్రోపవర్ ప్రాజెక్టులను నిర్మించాలి.

శ్రీబాగ్ ఒడంబడిక మేరకు రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రాధాన్యత నివ్వాలి. తెలుగు గంగ, గాలేరు-నగరి, హంద్రీనీవా ప్రాజెక్టు సామర్థ్యం నూరు టి.యం.సి.లకు పెంచాలి. పెన్నా హోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయరుకు 10 టి.యం.సి.ల నీరు అందించాలి. అనంతపురం జిల్లాలో అతి తక్కువ వర్షపాతం ఉన్నందున తుంగభద్ర నుండి వరద నీరు సమాంతర కాలువ నిర్మించాలి.

నాగార్జున సాగర్ కుడికాలువలను ప్రకాశం జిల్లాలోని కుర్చేడు నుండి నెల్లూరు జిల్లాలోని ఉదయగిరికి పొడిగించాలి. ప్రకాశం జిల్లాలో పూల సుబ్బయ్య (వెలుగొండ) ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలి.

వ్యవసాయ నియంత్రణనిధిని ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి. సహజ సిద్ధమైన ప్రకృతి విపత్తుల సహాయనిధిని ఏర్పాటు చేయ్యాలి. శీతలగిడ్డంగులకు నిరంతర విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలి. రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు ఇచ్చి వ్యవసాయ పనిముట్లు విత్తనాలు, ఎరువులు కొనుక్కోవడానికి అవి ఉపయోగపడేట్లు వారిని ఆదుకోవాలి. విత్తన చట్టం, వ్యవసాయ మార్కెటింగ్ చట్టాలను కఠినతరం చేయ్యాలి. జిల్లాల వారీగా పంటల ప్రణాళిక ఏర్పాటు చేయ్యాలి. వ్యవసాయ మార్కెట్లను కంప్యూటరీకరణ చేయ్యాలి. విత్తన, భూ సార పరిశోధనా కేంద్రాలు, పట్టు, డెయిరీ తదితర పరిశ్రమలను నెలకొల్పాలి.

- శ్రీకాకుళం నుండి చెన్నై వరకు ఇండస్ట్రీయల్ కారిడార్‌ను ఏర్పాటు చేయ్యాలి. తీరప్రాంత పర్యాటక కేంద్రాలను నెలకొల్పాలి. తీర ప్రాంతాల వారికి గ్రామీణ ఉపాధి హామి పథకం విస్తరించాలి.
- శ్రీకాకుళంలో గిరిజన విశ్వ విద్యాలయాన్ని నెలకొల్పాలి. శ్రీకాకుళంలో బావనపాడు, కళింగపట్నం నౌకా కేంద్రాల నిర్మాణం పూర్తి చేయ్యాలి. చేతి వృత్తులు, అటవీ ఉత్పత్తుల పరిశ్రమలను స్థాపించాలి.
- విజయనగరంలో మాంగనీస్, గ్రానైట్, జూట్ పరిశ్రమలను అభివృద్ధిచేయాలి.
- వైజాగ్‌ను ఎగుమతుల ప్రాసెసింగ్ జోన్‌గా ప్రకటించాలి. ఐ.టి.పార్కు, ఫార్మసిటీని నెలకొల్పాలి.
- కాకినాడలో పోర్టు స్థాయిని పెంచాలి.
- తూర్పుగోదావరిలో కోస్టల్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలి.
- పశ్చిమ గోదావరిలో అక్వా ప్రాసెసింగ్ జోన్‌ను, ఆక్వా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి.
- విజయవాడలో వ్యవసాయోత్పత్తుల ఆధారిత పరిశ్రమలను, రవాణ, వాణిజ్య హబ్‌ను స్థాపించాలి.
- గుంటూరును ఎడ్యుకేషన్ కేంద్రంగా తయారు చేయాలి.
- ప్రకాశం జిల్లా రామయపట్నంలో, మచిలీపట్నంలో నౌకాశ్రయాలు నిర్మించాలి. ప్రకాశం జిల్లాలో సుబాబుల్, జామాయిల్, పేపర్ మిల్లులను స్థాపించాలి.
- విశాఖ ఎయిర్ పోర్టును ఇండియన్ నావీ నుండి పౌర విమానయాన శాఖకు మార్చి అంతర్జాతీయ స్థాయికి పెంచాలి. అలాగే విజయవాడ, తిరుపతిలోని విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయికి పెంచాలి.
- ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ నుండి విశాఖ డివిజన్‌ను విడకొట్టి నూతన ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే జోన్‌ను ఏర్పాటు చేయ్యాలి. అలాగే నూతన రైల్వే మార్గాలను ఆన్వేషించాలి.
- విజయవాడ, విశాఖ, తిరుపతిలలో మెట్రో రైలు వ్యవస్థను ఏర్పాటు చేయ్యాలి.
- విజయవాడతో సహా 5 నగరాలలో సూపర్ స్పెషాలిటి హాస్పటల్స్ నిర్మించాలి. నూతన రాష్ట్రంలో పూర్తిస్థాయి హైకోర్టును ఏర్పాటు చేయ్యాలి. విజయవాడ, కొల్లేరు, పులికాట్ సరస్సు, అమరావతి, కొండపల్లి, పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయ్యాలి. మచిలీపట్నం పోర్టు నిర్మాణంలో ఉన్న అడ్డంకులు తొలగించి నిర్మాణపనులు వెంటనే ప్రారంభించాలి. కృష్ణాడెల్టా ఆధునీకరణ, బుడమేరు డైవర్షన్ స్కీము, సాగర్ ఎడమ కాలువల్లో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నిర్మించాలి.
- కడపలో బ్రహ్మణి ఉక్కు కర్మాగారం, అనంతపురంలోని ఓబులాపురంలో ఉక్కు కర్మాగారాలను ప్రభుత్వ రంగంలో నిర్మించాలి. బెంగళూరు అతి సమీపంలో ఉన్నందున అనంతపూర్, చిత్తూర్‌లలో సాఫ్ట్‌వేర్ పరిశ్రమను అభివృద్ధి చేయాలి. చిత్తూరులో

యన్.టి.పి.సిని, చెక్కెర ఫ్యాక్టరీని, బంగారు శుద్ధి కర్మాగారాన్ని స్థాపించాలి.

- కర్నూలులో మెడికల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి. పత్తికొండ, మదనపల్లిలో టమోట రసం ఫ్యాక్టరీలను నిర్మించాలి.
- అనంతపూర్‌లో సౌరశక్తిని, వాయు మరలతో విద్యుత్ ఉత్పత్తి చేయాలి. వేరుశనగ, ప్రొద్దుతిరుగుడు ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయ్యాలి.
- తిరుపతి, కాళహస్తి, కానిపాకంలలో ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతాలుగా రూపుదిద్దాలి.
- ప్రధాన నగరాలు, పట్టణాలలో ఇన్నర్ మరియు అవుటర్ రింగు రోడ్డులు నిర్మించాలి.

## రైతు రంగ సమస్యలు

అధిక ధరలతో సగటుజీవి సతమతమవుతున్నా మరొకవైపు రైతుల ఆత్మహత్యలు, ఆకలిచావులు కొనసాగుతున్నాయి. రైతన్న అతివృష్టి, అనావృష్టిలాంటి సమస్యలతో పాటు వ్యవసాయ పనిముట్ల ధరలు పెరిగి నానా ఇబ్బందుల కోర్చి పంట పండించినా గిట్టుబాటుధర లభించడం లేదు. కల్తీ ఎరువులు, కల్తీ విత్తనాలు, కల్తీ పురుగుమందులు మార్కెట్లో లభ్యమవుతున్నాయి. భూసారాన్ని కబళించే బహుళ జాతి కంపెనీల జన్యు మార్పిడి విత్తనాలు,ఎరువులే లభ్యమవుతున్నాయి. ఆ ఎరువులు సైతం మార్కెట్లో రైతులకు అందచేయడానికి విపరీతమైన జాప్యం జరుగుతున్నది. రైతులు స్వయాన ఎరువులు దొరకవేమోనన్న భయాందోళనతో కొన్ని సందర్భాలలో గంటలకొద్దీ క్యూలలో నిలబడి ఓపిక నశించే పరిస్థితిని ప్రభుత్వం ఎందుకు కల్పిస్తోంది. ఇన్ని వ్యయప్రయాసలకోర్చి పంట పండిస్తే రైతన్నకు గిట్టుబాటు ధర లభించడం లేదు. గుంటూరులో మిర్చి రైతులు, అనంతపూర్‌లో వేరుశెనగ రైతులు, కర్నూల్‌లో టమాట రైతులు మార్కెట్ యార్డులలోనే తమ పంటకు గిట్టుబాటు ధర లభించలేదని ఆందోళనలో భాగంగా తమ వ్యవసాయోత్పత్తులను వెనుకకు తీసుకెళ్ళడానికి ఇష్టంలేక మార్కెట్‌యార్డ్‌లలోనే వదిలివెళ్ళిన వైనాన్ని చూస్తే ఎవరికైనా కంటతడిపెట్టక ఉండలేరన్నది నగ్నసత్యం.

అటు వినిమయదారునికి సరసమైన ధరలకు వస్తువులు అందుబాటులో లేకుండా మరొకవైపు రైతన్నకు గిట్టుబాటు ధరలేక కేవలం మధ్య దళారీలు మాత్రమే లాభపడటం జరుగుతున్నది. మధ్యదళారీ వ్యవస్థను పాలకవర్గాలు రద్దు చేయలేకపోతున్నది. ప్రత్యక్షంగా ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, అలాగే మార్కెటింగ్ ఫెడరేషన్‌లు నేరుగా వ్యవసాయదారుని నుండి ఎందుకు కొనుగోలు చేయలేకపోతున్నది? శీతలీకరణ గోడౌన్‌లను ఎందుకు ఏర్పాటు చేయలేకపోతున్నది? ప్రజాపంపిణీ వ్యవస్థను ఎందుకు పటిష్టం చేయలేకపోతున్నది? బియ్యంతో పాటుగా నూనెలు, పప్పులు, చింతపండు, ఉల్లిగడ్డ తదితర వస్తువులను, కూరగాయలను చౌకడిపోలద్వారా సగటుజీవికి సరసమైన ధరలకు ఎందుకు అందచేయలేకపోతున్నది? ధరలను తగ్గించడానికి ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడింది. మధ్యదళారీ వ్యవస్థను పరిరక్షించడమే తన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. వరికి మద్దతు ధర కావాలని రైతన్నలు



పోరుబాట పట్టడం జరిగింది. వ్యవసాయ ఖర్చులకు అదనంగా 50% చేర్చి మద్దతు ధర ఇవ్వాలని స్వామినాథన్ కమిటీ చేసిన సిఫార్సులను అమలుచేయాలని సి.పి.ఐ. డిమాండ్ చేస్తోంది.

అతివృష్టి, అనావృష్టి లాంటి ప్రకృతి వైపరీత్యాల సందర్భాలలో రైతులను పంటల బీమా పథకం ద్వారా ఆదుకోవాల్సి వుండగా, కొన్ని పంటలలో ఎకరానికి రూ. 5,000/- నుండి రూ. 15,000/- వరకు ఖర్చు పెడితే కేవలం ఎకరానికి రూ. 2,000/- మాత్రమే నష్టపరిహారం చెల్లించి చేతులు దులుపుకోవటం జరుగుతున్నది.

సేంద్రియ ఎరువుల వాడకం, అధిక పంట దిగుబడులు రాబట్టడానికి తీసుకోవాల్సిన మెళకువలు, తదితర కొత్త కొత్త పద్ధతులను వ్యవసాయదారుల వద్దకు తీసుకుపోవడంలో వ్యవసాయ శాఖ ఘోరంగా వైఫల్యం చెందుతున్నది. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖను పూర్తిగా సంస్కరించాలి.

**రుణాలు-మాఫీలు:** సన్న, చిన్నకారు రైతులకు ప్రైవేటు అప్పులతో సహా సమగ్ర రుణ విమోచన పథకాన్ని తేవాలి. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి ఆ ప్రకారం రైతులకు రుణాలు విరివిగా ఇవ్వాలి. 2008-2009 రుణ ప్రణాళికలో ఖరీఫ్, రబీ సీజన్‌లో 20 వేల కోట్ల రూపాయల రుణాలను పావల వడ్డీపై ఇస్తామన్న లక్ష్యం సగం కూడా అమలు కాకపోవటం, రైతులు రుణాలు చెల్లించలేని స్థితి వల్ల పావలా వడ్డీ పథకం నీరుకారి పోవడం గమనార్హం. ప్రైవేటు వ్యాపారస్తులపై నియంత్రణ పెట్టాలి. సహకార వ్యవస్థను విస్తృతం చేయాలి. రైతులు, కౌలు రైతులందరికి సహకార బ్యాంకుల్లో సభ్యత్వం కల్పించాలి. రుణాలు ఇవ్వాలి.

**కౌలు రైతులకు గుర్తింపు కార్డులు:** కౌలు రైతులకు, సాగుదారులకు జి.ఓ. 1049 ప్రకారం, పాసుబుక్‌లు లేదా గుర్తింపు కార్డులు ఇవ్వాలి. బ్యాంకు రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీలు, పంట నష్ట పరిహారాలు, పంటల భీమా సౌకర్యం కౌలు రైతులందరికి ఇవ్వాలి.

**డిమాండ్స్:**

1. రైతు ఉత్పత్తులకు గిట్టుబాటు ధర నిర్ణయించి, ప్రభుత్వమే మార్కెటింగ్ ఫెడరేషన్, ఎఫ్.సి.ఐ. ద్వారా కొనుగోలు చేయాలి.
2. ప్రస్తుతం రైతు సంక్షోభంలో ఉన్నందున అన్ని రకాల రుణాలను అందరికి మాఫీ చేయాలి. వ్యవసాయ ఉత్పత్తులు చెడిపోకుండా ఉండటానికి శీతలీకరణ కేంద్రాలు ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి. శీతల గిడ్డంగులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి.
3. సామాజిక దృక్పథంతో మరియు మానవతా దృక్పథంతో ఆలోచించి 60 సం॥లు దాటిన ప్రతి రైతుకు నెలకు వెయ్యి రూపాయల జీవన భృతి ఇవ్వాలి.
4. ఆరోగ్య శ్రీ భీమా పథకం రైతులందరికి వర్తింపజేయాలి.
5. ఎవరైనా రైతు అర్థాంతరంగా చనిపోయి, మైనరు పిల్లలు, భార్య ఉన్న ఎడల

ఆ కుటుంబానికి చెందిన అన్ని రకాల రుణాలను మాఫీ చేసి రెండు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి.

6. వ్యవసాయ ఉత్పత్తుల ఆధారిత అన్ని రకాల పరిశ్రమలు గ్రామాలలోనే చిన్న కుటీర పరిశ్రమల రూపంలో నెలకొల్పాలి. దీని కారణంగా, గ్రామాలలో ఉపాధి అవకాశాలు పెరగడమే కాక, పెట్టుబడులు గ్రామాల వైపు మళ్లడమే కాక రైతులకు లాభము చేకూరుతుంది.
7. వ్యవసాయ ట్రాక్టర్‌లను మోటార్ వాహన చట్టం నుండి తొలగించాలి.
8. రైతు ఉత్పత్తి వ్యయం తగ్గించటానికి ప్రకృతి వ్యవసాయం, సేంద్రీయ వ్యవసాయానికి తగిన రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాలి.
9. పంటల భీమా పథకం అన్ని పంటలకు వాస్తవ నష్టాలకు నష్టపరిహారం చెల్లించే విధంగా సవరించాలి. అన్ని జిల్లాల్లో గ్రామ యూనిట్‌గా అమలు చేయాలి.
10. మార్కెట్ కమిటీలలో అవకతవకలు తొలగించి, పాలకవర్గానికి ప్రత్యక్ష ఎన్నికలు జరపాలి.
11. ప్రత్యేక ఆర్థిక మండళ్ళకు వ్యవసాయ భూములను కేటాయించరాదు.
12. కోరిన ప్రతి రైతుకు ఉచిత విద్యుత్ కనెక్షన్‌ను వెంటనే ఇవ్వాలి.
13. రైతుల ఆత్మహత్యల నివారణకు 10 ఎకరాలలోపు ఉన్న ప్రతి రైతుకు నెలకు రూ. 2,000/-లు జీవన భృతి చెల్లించాలి. ఆరోగ్యశ్రీ భీమా, వృద్ధాప్య పెన్షన్ అమలుపరచాలి.
14. 10 ఎకరాలపైనున్న రైతులలో ఏ ఒక్కరూ విప్పవించుకొన్నా దాని పరిస్థితి సమీక్షించి, అవసరమైన సహాయం అందించాలి.
15. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు ఎలాంటి జాప్యం లేకుండా సరఫరా చేయాలి.
16. వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలి.
17. సుస్థిర దిగుబడులు, ఆదాయం ఉండేలా మెట్ట సేద్యంలో పరిశోధన, విస్తరణ సేవలను పెంచాలి.
18. ఇన్‌పుట్స్ 50% సబ్సీడీపై నాణ్యమైనవి సకాలంలో ప్రభుత్వ సంస్థల ద్వారా రైతులకు అందించాలి.
19. అన్ని పంటలకు డాక్టర్ స్వామినాథన్ వ్యవసాయ కమీషన్ సిఫారసులను అనుసరించి గిట్టుబాటు ధరలు నిర్ణయించాలి. ప్రభుత్వమే కొనుగోలు సంస్థల ద్వారా ప్రకటించిన గిట్టుబాటయ్యే మద్దతు ధరలకు కొనాలి. దళారీల దోపిడీ నుండి రైతులకు రక్షణ కల్పించాలి.
20. ఆహార ధాన్యాలను ఫ్యూచర్ ట్రేడింగ్ నుండి మినహాయించాలి. ఆహార భద్రత కల్పిస్తూ అవసరమైన సబ్సీడీతో ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగుపరచాలి.



21. వ్యవసాయ శాఖలో ఖాళీలను భర్తీ చెయ్యాలి. ప్రొ॥ జయతిఘోష్ రైతుల సంక్షేమ కమీషన్ సిఫారసు మేరకు ప్రతి వెయ్యి ఎకరాలకు ఒక వ్యవసాయాధికారిని నియమించాలి. ఆదర్శ రైతుల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం వారి పార్టీ కార్యకర్తలను రాజకీయ ప్రయోజనాల కోసం చేసిన 50వేల పోస్టులను రద్దు చేయాలి.
22. వ్యవసాయ పరిశోధనకు తగినన్ని నిధులు కేటాయించాలి. ఆధునిక పరిజ్ఞానాన్ని అందించాలి. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను సబ్సీడీలు ఇచ్చి ప్రోత్సహించాలి.
23. సాగుదారులందరిని నమోదు చేయాలి. పాసుపుస్తకాలివ్వాలి.
24. మహిళా రైతుల హక్కులను కాపాడాలి. వారికి అన్ని రకాల ప్రోత్సాహాలు ఇవ్వాలి.
25. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని విస్తరింపచేయాలి. కుటుంబంలో పనిచేయగలిగిన వారందరికి చేయగలిగినన్ని రోజులు పని కల్పించాలి.
26. వ్యవసాయ అనుబంధ రంగాలైన డైరీ, పౌల్ట్రీ, ఫిషరీ, గొర్రెలు-మేకల పెంపకంకు ప్రతి రైతు కుటుంబానికి సబ్సీడీ రుణాలివ్వాలి. వాటికి తగిన మార్కెట్ సౌకర్యం, మద్ధతు ధరలు, ఇన్సూరెన్స్ కల్పించాలి.

**విద్యుత్ సమస్య:** అనాథరైజ్డ్ కనెక్షన్‌లను రెగ్యులరైజ్ చేయాలి. ట్రాన్స్‌ఫార్మర్లు, పోల్స్, వైర్లు లోడ్‌కి అనుగుణంగా పెంచి ఆధునీకరించాలి. దరఖాస్తుదారులందరికి నెల రోజుల్లోగా కనెక్షన్లు ఇవ్వాలి. ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోతే 48 గంటల్లో బాగు చేయించాలి. లో ఓల్టేజి వల్ల కాలిపోయే మోటార్లను ప్రభుత్వ బాధ్యతతో బాగు చేయించాలి. మోటార్లు కాలిపోకుండా ఫీజు నుండి మోటారు కనెక్షన్ ఇవ్వాలి.

విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయాన్ని కలుగచేస్తూ విద్యుత్ కోత విధించడం జరుగుతోంది. తత్ఫలితంగా మోటార్లు విరివిగా చెడిపోవడమే కాకుండా విద్యుత్ సరఫరా అంతరాయం వల్ల సాగుచేసుకొనే మొత్తం భూమి తడవని పరిస్థితి ఏర్పడుతున్నది. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో పగటిపూట 10 గంటలు ఎలాంటి అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేయాల్సి వుంది. అలాగే పేదప్రజలకు ముఖ్యంగా దారిద్ర్య రేఖ దిగువనున్న ప్రజలకు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేస్తోంది.

## సాంప్రదాయేతర పద్ధతుల ద్వారా విద్యుత్ ఉత్పత్తి పెంచాలి

ఆంధ్ర ప్రదేశ్‌కు తీర ప్రాంతం 1500 కి.మీ. ఉంది. జన వాసాలు లేని ప్రాంతాలు సైతం ఈ రేంజిలో ఉన్నాయి. ఈ జనవాసాలు లేని ప్రాంతాలలో సాంప్రదాయేతర పద్ధతిలో విద్యుత్‌ను మన రాష్ట్ర అవసరాల మేరకు సముద్రపు నీరు ద్వారా ఉత్పత్తి చేయడానికి 100% అవకాశాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం దీనితోపాటు సాంప్రదాయేతర పద్ధతులలో పిచ్చి మొక్కలు, చెత్త నుండి కూడా విద్యుత్ ఉత్పత్తి చేయడానికి అవకాశాలున్నాయి. అణు ఇంధనం ద్వారా విద్యుత్ ఉత్పత్తికి లక్షల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టే బదులు క్యూబా, చైనా దేశాల మాదిరిగా సాంప్రదాయేతర పద్ధతుల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయాలి.

## వ్యవసాయ కార్మికవర్గ హక్కులు

భారతదేశం ప్రధానంగా వ్యవసాయిక దేశం. ఈదేశంలో నూటికి 80 మంది ఈ రంగంపైనే ఆధారపడి పనిచేస్తున్నారు. ఇందులో ప్రధానంగా దళితులు, గిరిజనులు, ఇతర వెనుకబడిన వర్గాలవారు అధిక సంఖ్యలో పనిచేస్తున్నారు. ఈ వర్గాలవారికి అనేక ప్రాంతాలలో కనీస వేతనాలు అమలుకావడం లేదు. భూస్వాముల దౌర్జన్యాలు కొనసాగుతున్నాయి. మహిళా కార్మికులపై గ్రామీణ ప్రాంతంలో లైంగిక వేధింపులు అధికం. ఈరంగంలో అత్యధిక పురుషులు తాగుడుకు బానిసలు. అందులో వీరికి అన్ని రోజులు పనిదొరకని పరిస్థితి. ఈపూర్వరంగంలో అతి తక్కువ జీతంలో నికృష్టమైన జీవితాలను కొనసాగించడం జరుగుతున్నది.

1. 'దున్నే వానికే భూమి' అనే నినాదం సాకారం కావాలంటే భూ గరిష్ట పరిమితి చట్టానికి తగిన సవరణలు చేసి, భూమిలేని నిరుపేదలకు భూమి దక్కేలా చూడాలి. పంచిన భూమి అభివృద్ధికి తోడ్పడాలి.
2. అలాగే కోనేరు రంగారావు భూ కమిటి అమలు వల్ల వచ్చే భూములు పేదలకు పంచాలి. ఇప్పటికే పేదల ఆక్రమణలో ఉన్న సాగు భూములకు, ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలి. సమగ్ర సర్వేచేసి ప్రతి వ్యవసాయ కార్మిక కుటుంబానికి 1 హెక్టారు సాగుభూమి ఇవ్వాలి.
3. అటవీ హక్కుల చట్టంలో గిరిజనులతోపాటు ఆ ప్రాంత పేదలకు హక్కులు కల్పించాలి. అటవీ భూముల, రెవిన్యూ భూమి సరిహద్దు వివాదాలను పరిష్కరించాలి. ప్రత్యేక యంత్రాంగానికి చట్టబద్ధత కల్పించాలి.
4. విధిగా వ్యవసాయ కార్మికులకు ప్రతి రెండు సంవత్సరములకొకసారి కనీస వేతనాలను పునర్ వ్యవస్థీకరించాలి. పకడ్బందీగా అమలు చేయాలి.యంత్రాలు నియంత్రించాలి.
5. అర్హులైన వారందరికి ఇళ్ళ స్థలాలు, పక్కా ఇండ్లు, రక్షిత త్రాగునీరు, రోడ్లు, లైట్లు, వయోజన పాఠశాలలు, గ్రంథాలయాలులాంటి మౌలిక సదుపాయాలు కల్పించాలి.
6. వ్యవసాయ కార్మికులకు తరుచుగా ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా మందులు, దోమ తెరలు, గొడుగులు, కళ్ళజోళ్లు తదితరాలు అందజేయాలి.
7. అర్హులైన వారందరికి రేషన్ కార్డులు, వృద్ధాప్య, వితంతు, వికలాంగ పెన్షన్లు ఇవ్వాలి. పెన్షన్ వయో పరిమితి 55 సం॥లు చేయాలి. పెన్షన్ మొత్తం 1000 రూపాయలు చెల్లించాలి.
8. ఉపాధి హామీ, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ పథకాలు ఖచ్చితంగా నిరుపేదలకు అందాలి. గర్భిణీ స్త్రీల పెన్షన్ రెట్టింపు చేయాలి.
9. యస్సి, యస్టి, బిసి తదితర పేదల నివాస గృహాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి.
10. పాముకాటు వల్ల, పురుగు మందులు వల్ల, ఎయిడ్స్ తదితర ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో తక్షణం చికిత్స, ఉచితంగా మందులు ఇచ్చే సౌకర్యం కల్పించాలి. మెజల్స్, ఇతర అంటు రోగ నివారణకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాలి.
11. సామాజిక భద్రతా చర్యలతో భాగంగా ఇఎస్ఐ, పిఎఫ్, భీమా, ఉపాధి కల్పన, కనీస వేతనాలు, ఆహార భద్రత, పెన్షన్, వైద్యం లాంటి సౌకర్యాలతో ప్రత్యేకంగా సమగ్ర చట్టం చేయాలి.
12. గ్రామీణ ప్రాంతాలలో యస్సి, యస్టిలపై అత్యాచార నిరోధకం చట్టం ఖచ్చితంగా అమలు చేయాలి. ఉచిత సలహా, సహాయ కేంద్రాలు విస్తృతపర్చాలి.
13. సెజ్‌లకు వ్యవసాయ భూములు సేకరించి వ్యవసాయ కార్మికుల ఉపాధి పోగొట్టరాదు.
14. ప్రాజెక్టులు తదితర అభివృద్ధి కార్యక్రమాల వల్ల నిర్వాసితులైన పేదలను అన్ని విధాల ఆదుకోవాలి.
15. గ్రామీణ పురుషులకు, స్త్రీలకు ఆటలు, క్రీడలు, వైజ్ఞానిక, సాంస్కృతిక రంగాలలో ప్రోత్సహించాలి.
16. ప్రతి మండలంలో వృద్ధాశ్రమం నిర్మించాలి.
17. వ్యవసాయ కార్మికులుగా పని చేస్తున్న గర్భిణీ స్త్రీలకు నెలకు రూ.2000/- చొప్పున పది నెలలు చెల్లించాలి.

## పారిశ్రామిక, కార్మికరంగం

1. ప్రభుత్వరంగ సంస్థలయిన రోడ్డు రవాణా, సింగరేణి, విద్యుత్, విద్య, వైద్య తదితర రంగాలలో జరుగుతున్న దొడ్డిదారి ప్రైవేటీకరణ ప్రయత్నాలను రద్దుచేసి పటిష్టచర్యలు చేపట్టడం.
2. ఆర్‌టిసి ప్రభుత్వంలో విలీనం చేసి, ఉద్యోగులందరికి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలి.
3. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ రంగ పరిశ్రమల పునరుద్ధరణ.
4. వ్యవసాయ పరపతి సహకార సంఘాలను పునరుద్ధరించి, రైతులకు సరసమయిన ఋణ సౌకర్యానికి పూనుకోవడం.
5. విద్య, వైద్య రంగాలకు 6% బడ్జెట్ కేటాయింపులు జరిపి, ప్రభుత్వ ఆసుపత్రులను, విద్యాలయాలను అగ్రభాగాన నిలపడం.
6. చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు రక్షణ కల్పించాలి.
7. విదేశీ స్వదేశీ కార్పొరేట్ సంస్థలకిచ్చిన రాయితీలు, కార్పొరేట్ టాక్సు, పునః పరిశీలన.
8. సహకారరంగం యొక్క పాత్రను పటిష్టపరిచి పాలనా వ్యవస్థలో ప్రజల పాత్రను, పారదర్శకతను ప్రోత్సహించడం.
9. ప్రపంచబ్యాంకు ఆదేశానుసారం అవలంభిస్తున్న ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాల స్థానంలో ప్రత్యామ్నాయ ప్రజానుకూల విధానాలకు రూపకల్పన.

10. రాష్ట్రంలోని వ్యవసాయ కార్మికులు, అసంఘటితరంగ కార్మికులకు కనీసం 150 రోజుల పనిదినాలు మరియు ధరల సూచికి అనుసంధానించబడిన దిన వేతనాలకు గ్రామీణ మరియు పట్టణ పేదలకు హామీ.
11. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల వేతనం, సర్వీసు నిబంధనలు, పదోన్నతి, అలవెన్సులను శాస్త్రీయ పద్ధతిలో పునఃనిర్వచించి వారు పూర్తి సంతృప్తితో విధులు నిర్వహించుటకు తగు చర్యలు.
12. బీడీ కార్మికులు, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, ఆరోగ్య, గ్రామ సేవకులు, గ్రామదీపికలు, కంటింజెంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు మరియు ఔట్ సోర్సుడ్ ఉద్యోగుల ఉపాధి క్రమబద్దీకరణ సమానపనికి సమానవేతనం, మహిళా కార్మికులపై వివక్షత, ప్రత్యేక డిమాండ్ల తక్షణ పరిష్కారం.
13. ఉపాధిని పెంచే మౌలిక సదుపాయాల కల్పనారంగం, వ్యవసాయం, నీటిపారుదల, రోడ్లు, విద్యుత్, విద్య, వైద్యం మొ।। సేవా రంగాలకు బడ్జెట్‌లో అగ్రభాగం.
14. ఆరోగ్య బీమా (ఇఎస్ఐ), ప్రావిడెంట్‌ఫండ్, పెన్షను సౌకర్యాలను తగు రీతిలో చట్ట సవరణ చేసి కార్మికులందరికి వర్తింపు.
15. సుమారు రెండు కోట్ల మంది అసంఘటితరంగ కార్మికులకు ఉపాధి హామీ, ఆరోగ్యరక్షణ, వృద్ధాప్య పింఛను, గుర్తింపు కార్డులు మొ।। కీలక అవసరాలకొరకు చట్టపరమైన మార్పులు చేపట్టడం.
16. కనీస వేతన నిర్ధారణలో ప్రస్తుతమున్న యాజమాన్య అనుకూల సూత్రాల ప్రాతిపదిక స్థానంలో అంతర్జాతీయ కార్మికసంస్థ మార్గదర్శకాల వెలుగులో నైపుణ్యం లేని కార్మికుని కనీస వేతనం రు. 12,500/- చెల్లించాలి.
17. కార్మిక వ్యతిరేక చట్టాలను సమగ్రంగా, కార్మిక సంఘాలతో చర్చించి, కార్మిక హక్కులకు గ్యారంటీ. కార్మికుల సమస్యలు న్యాయస్థానాలలో పెండింగు అయి జాప్యానికి కారణమౌతున్న ఆటంకాలను తొలగించడం.
18. షాపు అండ్ ఎస్టాబ్లిష్‌మెంటు చట్టానికి. టి.యు. చట్టం, ఐ.డి. యాక్టులకు ప్రతిపాదిత కార్మిక వ్యతిరేక సవరణలను తిరస్కరించి సానుకూల విధానాల రూపకల్పన.
19. శతాబ్దాలుగా అణిచివేయబడిన మునిసిపల్ మరియు పంచాయతీ పారిశుధ్య కార్మికుల వంశపారంపర్య హక్కు పునరుద్ధరణ.
20. ప్రైవేటురంగంలో కూడా ఎస్.సి, ఎస్.టి.లకు ఇతర వెనుకబడిన వర్గాలకు సంచార జాతులకు ఉపాధి రిజర్వేషను కల్పించాలి.
21. కార్మికరంగంలోని వివిధ సలహా సంఘాలను రాజకీయ నిరుద్యోగులకు ఉపాధిగాకాకుండా, నిర్మాణాత్మకంగా, అన్ని కార్మిక సంఘాల ప్రతినిధులతో కూడా అధికారపూరిత సలహాసంఘాలుగా వ్యవస్థీకరణ.
22. లాకౌట్, లేఆఫ్‌లు, రెట్రించ్‌మెంటులను నిలువరించుటకు, ఉపాధి కల్పనకు సహకరించుటకు అవసరమయిన చర్యలు చేపట్టుట.



23. చిల్లర వ్యాపారులు, ఫుట్‌పాత్ వెండార్సు, తోపుడు బండ్ల వ్యాపారులకు గుర్తింపుకార్డులు, ఋణ సౌకర్యాలు, సంక్షేమ చట్టం ఏర్పాటు.
24. ప్రైవేటు మోటారు, ఆటో, జీపు, టాక్సీల డ్రైవర్లు, మెకానిక్‌లు, క్లీనరులపై లైసెన్సు, జరిమానా, పోలీసు, ఆర్‌టిఏ వేధింపుల నివారణా చర్యలు.
25. మూతపడిన ఫ్యాక్టరీలను తెరిపించాలి.
26. ఆటో డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులు, తోపుడు బండ్ల వ్యాపారస్తులు, ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న క్యాజువల్, కాంట్రాక్టు కార్మికులు, ప్రైవేటు ఫ్యాక్టరీలలో పనిచేస్తున్న కార్మికులకు బలహీనవర్గాలుగా గుర్తించి పక్కా ఇళ్ళు కట్టించి ఇవ్వాలి.

## లఘు పరిశ్రమలు

మనదేశ స్వావలంబనకు తోడ్పడేందుకు రాష్ట్రంలో లఘుపరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటునివ్వాలి. ఇందులో భాగంగా హేతుబద్ధమైన ఆదాయపు పన్ను విధానం ఉండాలి. అలాగే ఎలాంటి అంతరాయాలులేని విద్యుత్‌ను పరిశ్రమలకు అందజేయాలి. పారిశ్రామిక కూడలిలో రోడ్డులు, రసాయన వ్యర్థ పదార్థాలు నేరుగా వెళ్ళేందుకు డ్రైనేజి వ్యవస్థ ఉండాలి. అలాగే ప్రతి పారిశ్రామికవాడలలో విధిగా ఏపిఐఐసి రసాయన శుద్ధిప్లాంటును ఏర్పాటు చేయాలి. మంచినీరు సౌకర్యం, అలాగే ముడి సరకులు పరిశ్రమలకు అందేట్లు చూడాలి. పరిశ్రమల ద్వారా చెల్లించబడుతున్న మున్సిపల్ పన్నులో 65% పారిశ్రామికవాడ అభివృద్ధికి కేటాయించాలి. అత్యధిక గ్యాస్ ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా గృహ అవసరాలకిస్తూనే, విద్యుత్, డీజెల్ బదులు గ్యాస్ వాడకందారులైన పరిశ్రమలకు ప్రాధాన్యత ఇచ్చి వారికి సరఫరా చేయాలి. మిగులు గ్యాస్‌ను మాత్రమే ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేయాలి. మన రాష్ట్రంలో లభ్యమవుతున్న ఖనిజ ఆధారిత, వ్యవసాయ ఉత్పత్తుల, అటవీ ఉత్పత్తుల ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయాలి.

రాష్ట్రంలో అనేక ఐటిఐలు మూతపడినందున వాటిని తెరిపించాలి లేదా నైపుణ్యంగల కార్మికులను శిక్షణ ద్వారా తయారుచేసుకొంటున్న పరిశ్రమలకు సబ్సిడీని ప్రభుత్వం అందచేయాలి. అలాగే ప్రైవేటు పరిశ్రమలలో సైతం దళిత, గిరిజన, మైనారిటీలు, ఇతర వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్‌లు కల్పించాలి.

## శ్రామిక మహిళా హక్కులు

సామాజిక అభివృద్ధిలో సమాన భాగస్వామ్యం వహిస్తున్నప్పటికీ మహిళలకు అందవలసిన అభివృద్ధి ఫలాలు మాత్రం అందటం లేదు. విద్య, వైద్య సహాయాలు అందటంలో సామాజిక, ఆర్థిక కారణాలవల్ల తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నారు. ఆర్థికమాంద్యం కారణం కూడా తోడవగా ఉపాధి కోల్పోవడంలో ప్రథములవుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ఉపాధి కల్పించడంలో, భద్రత కల్పించడంలో తీవ్రంగా విఫలమయ్యారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే

ఆకర్షక పథకాలు, ప్రజలవద్దకు తీసుకువెళ్ళే క్రమంలో, వేరే గత్యంతరం లేక స్థానిక మహిళలకు అప్పచెప్పడం జరుగుతోంది. మహిళలు ఈ పనులను చాలా సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. వారి పూర్తి సమయం దీనికి కేటాయిస్తున్నారు. వారిని ప్రభుత్వం పూర్తికాలం ఉద్యోగులుగా గుర్తించి కనీసం, కనీస వేతనాలు చెల్లించాలి. వారిని కనీస వేతన చట్ట పరిధిలోకి తీసుకురావాలి. కానీ ప్రభుత్వం వారితో వెట్టిచాకిరీ చేయించుకుంటూ గౌరవ వేతనం పేరుతో, పారితోషికం పేరుతో, డ్వాక్రా గ్రూపులకు ఉపాధి పేరుతో అతి తక్కువ రుసుంను చెల్లిస్తున్నారు. కొందరికి అది కూడ చెల్లించడం లేదు.

అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, మధ్యాహ్న భోజన పథక కార్యకర్తలు, విద్యావలంటీర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వాలంటీర్లు, ప్రేరక్‌లు, ఇందిరాక్రాంతి పథకంలో పనిచేసే ఆనిమేటర్స్, గ్రామదీపికలు, సంఘమిత్రాలు తదితరులు ఈ క్యాటగిరీలో పనిచేసే శ్రామిక మహిళలు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు గత 38 సం॥ల నుండి ఐ.సి.డి.ఎస్. రంగంలో పేద మహిళలకు, గర్భిణీ, బాలింతలకు, 0-6 శిశువులకు, పిల్లలకు పౌష్టికాహారలోపం నివారించడానికి కృషిచేస్తూ, వైద్యసలహాలు అందిస్తూ, పిల్లలకు ప్రిస్కూలు నిర్వహిస్తుంటే వారికి నామమాత్రపు గౌరవ వేతనాలు మాత్రమే చెల్లిస్తున్నాయి. ప్రభుత్వ పనులు నిర్వహిస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి గ్రేడ్ III, గ్రేడ్ IV పోస్టులలో వారిని నియమించాలి. వారికి పెన్షన్ పథకం ప్రవేశపెట్టాలి. అప్పటివరకు వర్కర్లకు 1 లక్ష, హెల్పర్లకు 75వేల రూపాయలు గ్రాట్యుటి చెల్లించాలి. కాంట్రాక్టీకరణకు స్వస్తి పలకాలి.

మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే మహిళా కార్యకర్తలను ఉద్యోగులుగా గుర్తించి నెలవారీ వేతనాలు చెల్లించాలి. పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ, పెన్షన్ సౌకర్యాలు కలుగచేయాలి. వారికి ఉద్యోగభద్రత కల్పించాలి. ప్రైవేటీకరణ రద్దు చేయాలి. ఆశా వాలంటీర్లకు, ఆరోగ్య కార్యకర్తలకు పనినిబట్టి పారితోషికం గాకుండా నెలసరి వేతనాలు చెల్లించాలి.

ఇందిరా క్రాంతి పథకంలో ప్రభుత్వం గొప్ప విప్లవంగా చెప్పుకునే మహిళా గ్రూపుల తయారీలో ప్రధానపాత్ర నిర్వహిస్తున్న ఆనిమేటర్స్, గ్రామదీపికలు, సంఘమిత్రలకు నెలసరి వేతనాలు చెల్లించాలి. ప్రేరక్‌లకు ఇచ్చే పారితోషికం వెంటనే పెంచాలి. వీరందరినీ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగభద్రత కల్పించాలి.

ప్రతి ప్రభుత్వ విభాగంలో కూడా ప్రోత్సహిస్తున్న ఔట్‌సోర్సింగ్ విధానానికి స్వస్తి చెప్పాలి. కాంట్రాక్టీకరణ విధానాలు రద్దుచేసి అందరికీ ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించాలి. ప్రతి పరిశ్రమలోనూ పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతన చట్టం, బోనస్ చట్టం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలి.

పని ప్రదేశాలలో ఉద్యోగినులు, శ్రామికులు ఎదుర్కొనే లైంగిక వేధింపులను అరికట్టడానికి సుప్రీంకోర్టు మార్గదర్శక సూత్రాలను, మహిళా హక్కులు వెంటనే అమలుచేయాలి. వీటిని వెంటనే చట్టరూపంలో తీసుకురావాలి.



## ఇంటి పనివారల సంక్షేమానికి సమగ్ర శాసనం తీసుకు రావాలి

ఈ రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు గ్రామీణ ప్రాంతాల నుండి పొట్టచేత పట్టుకొని పట్టణ ప్రాంతాలకు ఉద్యోగాన్వేషణలో వస్తున్నారు. ఏ ఉద్యోగము దొరకని మహిళలు, బాలికలు ఇంటిపని వారలుగా చేరుతున్నారు. కొన్ని సందర్భాలలో వెట్టిచాకిరి సైతం కొనసాగుతున్నది. పసితనంలోనే గ్రామాల నుండి పని పిల్లగా బాలికను తీసుకొచ్చి ఇంత తిండి పడేసే పరిస్థితి కొనసాగుతున్నది. ఆడవాళ్ళు బయటికి వెళ్ళినపుడు పని పిల్లలపై లైంగిక వేధింపులు కొనసాగుతున్నాయి. వీటిని నిరోధించాలి. బాల కార్మిక వ్యవస్థను, వెట్టి చాకిరి నిషేదం అమలు చేయాలి.

- సామాజిక భద్రత, వైద్యం, ఇన్సూరెన్సు సౌకర్యాలు కల్పించాలి.
- ఇంటి పనివారలను కనీస వేతనాల చట్టం షెడ్యూల్‌లో చేర్చాలి.
- ఇంటి పనివారలకు స్వతంత్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి.
- మహిళా, శిశు సంక్షేమ కమీసన్లు పనివారల సంక్షేమానికై నిర్థిష్ట చర్యలు చేపట్టాలి.

### బాలల హక్కులు

రాష్ట్రంలో లక్షలాది మంది బాలలు పోషకాహారలోపంతో ఉన్నారు. శిశుమరణాల రేటును, శిశు విక్రయాలు మాతృమరణాల రేటు తగ్గించలేకపోయారు. పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతతో మరుగుదొడ్లు, గదులు, నీటిలాంటి కనీస సౌకర్యాలలేమితో కొనసాగుతున్నాయి. బాలలకు ప్రాథమిక వైద్యం, ఆరోగ్యం అందక గిరిజన బాలలెందరో మృత్యువాతపడ్డారు.

వారికి మనుగడ సాగించే హక్కు, చదువుకునే హక్కు, ఆరోగ్యంగా జీవించే హక్కు, తమ సామర్థ్యాలను సంపూర్ణంగా అభివృద్ధి చేసుకునే హక్కులు ఉన్నాయి. ప్రభుత్వ చర్యలు, నిశ్చేష్టలు పిల్లలపై మరే ఇతర వర్గాలకన్నా ఎక్కువగా ప్రభావం చూపుతాయి.

### బాలల ఆరోగ్యం

1. సురక్షిత, ఆసుపత్రి ప్రసవాలకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసి, మాతృ, శిశు మరణాలను అరికట్టాలి.
2. పిల్లలందరికీ పూర్తిస్థాయి ఇమ్యూనైజేషన్ అందించాలి.
3. ప్రతి పాఠశాలలో (ప్రభుత్వ, ప్రభుత్వేతర) ఆరోగ్యపరీక్షలు జరిపి వైద్యసేవలందించాలి.

### బాలల రక్షణ

1. రాష్ట్రంలో "ఉచిత, నిర్బంధవిద్య మరియు సంపూర్ణ బాలకార్మిక వ్యవస్థ నిషేధ" చట్టాన్ని రూపొందించి అమలుపరచాలి.
2. వీధి బాలలు, అక్రమ రవాణాకు గురవుతున్న పిల్లలు, నిర్లక్ష్యానికి గురవుతున్న పిల్లల రక్షణకు ఏర్పాట్లతో బాటు పూర్తిస్థాయి చర్యలు తీసుకోవాలి.
3. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చట్టం 2005, ప్రకారం "రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషను (SCPCR)" ఏర్పాటు చేయాలి.

4. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బ్రిడ్జి స్కూల్సు ఏర్పాటుతో మాత్రమేగాక పటిష్టమయిన చర్యలు.

### బాలల అభివృద్ధి

- పోషకాహార లోపనివారణతోబాటు బాలల సమగ్ర అభివృద్ధికొరకు అదనపు బడ్జెట్ కేటాయింపుల ద్వారా ఆరేళ్ళలోపు బాలలందరికి స్థానికంగా వండిన వేడివేడి పోషకాహారాన్ని అంగన్‌వాడీల ద్వారా అందించాలి.
- సుప్రీంకోర్టు ఆదేశాల కనుగుణంగా అన్ని జనావాస ప్రాంతాలలో కావలసిన అంగన్‌వాడి కేంద్రాలు, పక్కా భవనాలను ఏర్పాటు చేయాలి.
- అంగన్‌వాడిలో అదనపు కార్యకర్తను ఏర్పాటుచేసి పూర్వప్రాథమిక విద్యను అంగన్‌వాడి కేంద్రాలు, పాఠశాలల సమన్వయంలో పటిష్టంగా అమలుచేయాలి.
- **మధ్యాహ్న భోజన పథకం :** బాలల్లో పోషకాహారలోప నివారణ మధ్యాహ్న భోజన పథకము యొక్క ముఖ్య ఉద్దేశ్యం. పాఠశాలల్లోని బాలల బరువు, ఎత్తు పెరుగుదలను నెలవారీగా రికార్డుచేస్తూ భోజనంలో పోషకాలు ఉండే విధంగా మెనూను రూపొందించి పకడ్బందీగా అమలుపరచాలి.
- ప్రతి అసెంబ్లీ సమావేశాల్లో పిల్లల అంశంపై ప్రత్యేకమైన తేదీని ప్రకటించి చర్చించాలి.
- బాలలకొరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలి.
- ప్రతి గ్రామ పంచాయతి, మున్సిపల్ వార్డు, నగరపాలక డివిజన్‌లో కనీసం 5 ఎకరాల స్థలంలో పిల్లల కొరకు పార్కులు మరియు ఆటస్థలం ఏర్పాటు చేయాలి.
- రాష్ట్ర బడ్జెట్‌లో 20% - 30% పిల్లల కొరకు కేటాయించాలి.
- అన్ని జిల్లాల్లో చైల్డ్‌లైన్ సౌకర్యం కల్పించాలి.
- బాలల కొరకు రూపొందించిన "రాష్ట్ర కార్యాచరణ ప్రణాళిక" (State Plan of Action for Children) ను అమలుచేయాలి.
- ప్రతి గ్రామ పంచాయతి, నగరపాలక, మున్సిపాలిటి ప్రాంత పాలక మండలిలో సంవత్సరానికి 2 సార్లు బాలల కొరకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలి మరియు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన బడ్జెట్ కేటాయించాలి.
- అన్ని పాఠశాలల్లో (ప్రభుత్వ/ప్రభుత్వేతర) బాలలపై అన్నిరకాల హింసల నిషేదాన్ని పటిష్టంగా అమలుచేయాలి.
- రానున్న ఐదు సంవత్సరాల కాలంలో బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలి.

### మహిళా రంగం

భారతదేశంలో మహిళ స్థితిగతులు చూసినపుడు ప్రధానంగా ఆరోగ్య సమస్య, పౌష్టికాహార కొరత, రక్తహీనత ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్‌లో 51-64 శాతం మహిళలు బాధపడుతున్నారు. రక్షిత మంచినీటి కొరత, మరుగుదొడ్ల సమస్య, మద్యం సమస్యల ఇవన్నీ వారి ఆరోగ్యంపై



ప్రభావం పడుతుంది. సంఘటితరంగాన్ని దూరంచేసి అసంఘటితరంగంలో మహిళలచే వెట్టి చాకిరీ చేయించుకుంటూ వారికి కనీస వేతనం కూడా కల్పించలేకపోయింది ప్రభుత్వం.

రాజకీయరంగంలో మహిళలు గత నూరు సం॥ముల నుండి పోరాడుతున్నప్పటికీ ప్రపంచవ్యాపితంగా పార్లమెంటులలో మహిళ ప్రాధాన్యత కేవలం 18 శాతం. 1995 సం॥ నుండి ఇది చాలా స్వల్పమైన పురోగతి అనాలి.

2008లో 54 దేశాలలో పార్లమెంటు ఎన్నికలు జరిగితే యూరపు దేశాలలో 18.3 శాతం మహిళలు ఎన్నికయ్యారు. భారతదేశంలో 10% లోక్‌సభలోనూ, ఆంధ్రప్రదేశ్‌లో చూస్తే కేవలం 9% మహిళలు చట్టసభలలో వున్నారు. ఇది మహిళా పురోగతికి మొదటి అడ్డుకట్ట. ఆంధ్రప్రదేశ్‌లో మహిళా సాధికారత ఎంత అనేది అర్థం అవుతుంది. మహిళా నిరక్షరతా శాతం 51 శాతంగా ఉంది. భూమిపై మహిళకు హక్కు నామమాత్రంగా వున్నది. కాని ఓటర్లు విషయం చూస్తే మహిళా ఓటర్లు 2,86,42,117 మంది. పురుషులు 2,80,09,935. అధిక శాతం ఓటర్లు మహిళలున్నా, 9 శాతం అసెంబ్లీలో స్థానాలు కలిగివున్నారంటే, మహిళా ఓటర్ల పట్ల వున్న ప్రేమ వారి పురోగతిపై లేదన్నది అక్షరసత్యం.

దేశం మొత్తం 10,950 మహిళలను హింసించిన కేసులు నమోదు అయితే ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 3316 కేసుల నమోదుతో అమ్మాయిల అమ్మకాలు 20 లక్షలు దేశవ్యాపితంగా జరిగితే ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 5 లక్షలమంది అమ్మకాలు జరిగాయని తెలిసింది. మహిళలను అవమానించిన కేసులు 1200 అయితే 1005 ఆంధ్రప్రదేశ్‌లోనే ఇది 83%.

**ఈ క్రింది సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం.**

1. మహిళలకు భూమిపై హక్కు దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం చూడాలి.
2. చట్టసభలలో 33 1/3 శాతం ప్రాతినిధ్యం కల్పించాలి.
3. ఇంటిస్థలం, ఇల్లు మహిళలకు యివ్వాలి.
4. ఉపాధి హామీ పథకం సక్రమ అమలు, జాబ్‌కార్డులు మహిళలకు యివ్వాలి. మహిళలకు పని కల్పించాలి. ఒంటరి మహిళలకు, వితంతువులకు కూడా జాబ్‌కార్డులు ఇవ్వాలి.
5. అంచలవారీ మద్య నిషేధం రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావాలి. దీనిని చిత్తశుద్ధితో అమలుచేయాలి.
6. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు అభివృద్ధి చేయాలి. మహిళా డాక్టర్లు, నర్సులు, ఆపరేషన్ పరికరాలు, ఆధునిక వైద్యానికి ఉపయోగపడే విధంగా మందులు, థియేటర్లు వసతులతోటి అభివృద్ధి చేయాలి.
7. అసంఘటితరంగంలో పనిచేసే బీడీ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, పుగాకు కార్మికులు, మాతా శిశుసంక్షేమశాఖలో పనిచేసే కార్మికులకు, ప్రావిడెంట్‌ఫండు, ప్రసూతి సౌకర్యం, అలవెన్సు, సెలవులు వసతులు కల్పించాలి. మున్సిపల్ మహిళా కాంట్రాక్ట్ కార్మికులు, కాంట్రాక్టు ఉద్యోగులను, కాంట్రాక్టు లెక్చరర్స్, కాంట్రాక్టు ఐ.సి.డి.యస్. సూపర్‌వైజర్‌లను పర్మినెంట్ చేయాలి.

8. గృహ హింసా చట్టం అమలు కొరకు ప్రత్యేక అధికారిని రక్షణాధికారిగా యంత్రాంగంతో సహా నియమించాలి. చట్టం విచారణకు ప్రత్యేక కోర్టులు, జడ్జీలు, ప్రాసిక్యూటర్లు, సిబ్బందితో సహా నియమించాలి.
9. మహిళా పోలీస్‌స్టేషన్స్, సిబ్బందితో సహా ప్రతి డివిజన్ హెడ్ క్వార్టర్‌లో నియమించాలి.
10. సెన్సార్‌బోర్డును, సినిమా, టి.వి. ఛానల్స్ నియంత్రణకు అనుకూలంగా చట్టాలలో మార్పు తీసుకురావాలి. బోర్డును స్వతంత్ర ప్రతిపత్తిగలిగిన సమాజంపట్ల అవగాహన గలిగిన వారిని సభ్యులుగా నియమించాలి.
11. బాల్య వివాహాల నివారణకు, వివాహాలకు తప్పనిసరి రిజిస్ట్రేషన్ చట్టాన్ని చేసి అమలుచేయాలి.
12. విదేశీ భారతీయ మహిళలపై జరుగుతున్న హింస నివారణకు చట్టం తేవాలి.
13. టూరిజం అభివృద్ధి పేరుతో రోడ్డు ప్రక్క బార్లు, పబ్స్ పర్మిషన్లు, అమ్మాయిలు, శిశు అమ్మకాలను అరికట్టాలి.
14. మహిళల సమస్యల పరిష్కారానికి ప్రతి సర్కిల్ పరిధిలో ఒక మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి.
15. మహిళా సాధికారత రాష్ట్ర విధానాన్ని పటిష్టవంతం చేసి అమలు చేయాలి.
16. విద్యార్థినీలకు కరాటే లాంటి స్వీయ రక్షణ శిక్షణలు పాఠశాలల్లో, కళశాలల్లో ఇవ్వాలి.
17. మహిళల పేరున ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసినప్పుడు రిజిస్ట్రేషన్ ఫీజు సగానికి తగ్గించే చర్యలు తీసుకోవాలి.
18. పొదుపు, డ్వాక్రా మహిళలకు అమలవుతున్న పావలా వడ్డీ బ్యాంకుల ద్వారా నేరుగా గ్రూపు సభ్యులకు అందించడానికి చర్యలు తీసుకోవాలి.
19. ఇందిరా క్రాంతి పథకం అమలుపై పొదుపు గ్రూపుల నిర్వహణకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించాలి.

## మహిళల భద్రతకోసం స్వతంత్ర వ్యవస్థ ఏర్పాటు చేయాలి

మహిళల భద్రతకోసం స్వతంత్ర బహుళసభ్య దర్యాప్తు మరియు ప్రాసిక్యూషన్ కమిషన్ ఏర్పాటు చేయాలి. ఈ కమిషన్ సభ్యులుగా ఎంపికచేసేందుకు ప్రతిభ, నిజాయితి కలిగినవారిని సూచించమని ఆంధ్రప్రదేశ్‌లోని మహిళా సంఘాలను కోరాలి. సూచించిన వారిలో ముగ్గురిని ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ ఎంపిక చేయాలి. అలా ఎంపిక చేసిన వారిని ప్రభుత్వము కమిషన్ సభ్యులుగా నియమించాలి. వారిలో ఒకరిని అధ్యక్షుడిగా నియమించాలి. వీరందరికీ లోకాయుక్తకున్న పదవీ భద్రత కల్పించబడాలి. ప్రతి జిల్లాలో ఈ కమిషన్ యొక్క శాఖలు ఏర్పాటు చేయాలి. ఈ కమిషన్ దర్యాప్తు చేసిన నేరాలను సత్వర విచారణకు ప్రతి జిల్లాలో ప్రత్యేక కోర్టులు ఏర్పాటుచేయాలి. ఆర్థిక సాధికారత కోసం ప్రతి పేద మహిళలకు స్వయం ఉపాధి సాధనం కల్పించాలి.



సామాజిక సాధికారత కోసం పేద బాలికల కోసం రెసిడెన్షియల్ పాఠశాలలు అవసరమైనచోట ఏర్పాటు చేయాలి.

మహిళలు అన్ని రంగాల్లోకి ప్రవేశించగలిగారు. పూర్వపు తరాలతో పోలిస్తే మనం ఒక అడుగు ముందుకు వెయ్యగలిగాం. కాని శ్రామిక మహిళ పరిస్థితులు రోజురోజుకు నిరాశాజనకంగా మారుతున్నాయి. ఆర్థిక అసమానతలు వేగంగా పెరిగిన, ఈ మధ్యకాలంలో స్త్రీలపై ఒత్తిడి మితిమీరిపోయింది. ప్రభుత్వ విధానాలు వాళ్ల కష్టాల్ని పెంచుతున్నాయి. పదేపదే ఉపరితలంలోకొస్తున్న సామాజిక, సాంస్కృతిక సంక్షోభాలు వాళ్ల హక్కుల్ని హరించివేస్తున్నాయి. వాళ్ల జీవితాల్ని దిగజారుస్తున్నాయి. ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైరుధ్యమైన విధానాల్లో మహిళల ఆర్థిక పరిస్థితిపై ప్రభావం చూపేది మద్యం అందుబాటులోకి తేవడం. రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న భూమి లేని వ్యవసాయ కార్మికులు, అసంఘటిత కార్మిక కుటుంబాలు ఆర్థిక కష్టాల్లో కూరుకుపోవడానికి ఈ మద్యం కారణమౌతున్నదని అందరికీ తెలిసిన సత్యమే. ఆ కుటుంబాల్లోని స్త్రీలు అన్ని విధాలా ప్రతికూల పరిస్థితుల్లోకి నెట్టబడుతున్నారు. కొత్తకొత్త ఎక్సైజ్ పాలసీలు అమలుచేయటం, మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా పెరగడం, మనం చూస్తున్నాం. బెల్టు షాపుల వరవడి నేడు రాష్ట్రమంతా నడుస్తున్నది. 70 లక్షల అదనపు ఉత్పత్తికి జి.ఓ. తెచ్చింది. విదేశీ మద్యం కొరకు లైసెన్సులు ఇవ్వటానికి అంగీకారం కుదుర్చుకున్నది.

1990ల్లో మహిళా ఉద్యమాల ఫలితంగా అనేకమంది ఉద్యమకారుల త్యాగాల నేపధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, మద్యాన్ని నిషేధించింది. అయితే దాన్ని నీరుకార్చటానికి ఎక్కువ కాలం పట్టలేదు. శ్రమజీవుల కుటుంబాలు, మహిళల బ్రతుకులు ఛిద్రమైపోయే ఆర్థిక పరిస్థితికి మూలమైన మద్యం దశలవారీగా మళ్ళీ ప్రవేశపెట్టబడింది. పైగా ప్రభుత్వమే మద్యం తయారీ కేంద్రాల్ని పెట్టింది. వాటికి తోడు గుడుంబా, దొంగ సారాయి ఏరులై పారే స్థితి వచ్చింది. ప్రజారోగ్యానికి అతి కీలకమైన మంచినీరు, పౌష్టికాహారం అందించలేని ప్రభుత్వం చీప్ లిక్కర్ అందుబాటుపై శ్రద్ధ చూపెడుతున్నది. వ్యాపారులు పెచ్చరిల్లిపోయారు. మాఫియా గ్యాంగ్ పెరిగింది.

పేద, సామాన్య కుటుంబాల్లో మగవాళ్ళకు తాగుడొక వ్యసనంగా మారటం, యింట్లో తిండి గింజలక్కూడా కరువు రావడం నేటి దుస్థితికి అద్దం పడుతున్నది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలు కూడా నిరుపయోగంగా మారుతున్నాయి. అంచెల వారీ మద్య నిషేదాన్ని తీసుకురావాలి.

- ప్రభుత్వం మద్యాన్ని ఒక ఆదాయ వనరుగా ప్రభుత్వం చూడకూడదు.
- జాతీయ, రాష్ట్ర రహదారులపై బడి, గుడి సమీప ప్రాంతాల్లో ఉన్న మద్యం షాపులను తొలగించాలి.
- వ్యసనపరులకు డీ అడిక్షన్ కేంద్రాలను అన్ని మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయాలి.

- మద్యం వ్యాపారాన్ని ప్రోత్సహించే అన్ని రకాల వ్యాపార ప్రకటనలను నిషేధించాలి.
- మద్యం సేవించి వాహనాలు నడిపేవారి డ్రైవింగ్‌లైసెన్స్‌లు 1 సం॥పాటు సస్పెండు చేయాలి.

## యువజన రంగ సమస్యలు

విద్యావంతులైన నిరుద్యోగుల సంఖ్య నానాటికి పెరిగిపోతున్నది. దీనికి తోడు పెరుగుతున్న జనాభాకనుగుణంగా కొత్తగా పరిశ్రమల స్థాపన జరగడంలేదు. దీనికి తోడు రాష్ట్రంలో వేలాది పరిశ్రమలు మూతపడ్డాయి. దీని వల్ల నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోతుంది. వీటికి తోడు గతంలో మేధో వలస పెరిగిపోయి చివరికి వారు సైతం ఇంటి బాట పట్టారు. మన దేశంలో సైతం లక్షలాది మంది నిరుద్యోగులు కానున్నారు. ఈ నేపథ్యంలో నిరాశా, నిస్పృహలకు గురైన వారు మితవాద, అతివాద తీవ్రవాదముల వైపు కొట్టుకుపోవడం జరుగుతున్నది. ఈ సామాజిక ఆర్థిక సమస్యను పరిష్కరించాలి.

**డిమాండ్స్:**

- భారత రాజ్యాంగంలో "ఉద్యోగ హక్కును" పొందుపరచాలి.
- వేలాది మందిని ఇముడ్చుకొనే ప్రభుత్వరంగ పరిశ్రమలను స్థాపించాలి.
- స్వయం ఉపాధి పథకాలను సైతం ప్రవేశపెట్టాలి.
- బ్యాంకుల ద్వారా నిరుద్యోగులను ఆదుకోవడానికి స్వల్ప వడ్డీతో రుణాలివ్వాలి.
- నిరుద్యోగులకు నిరుద్యోగభృతి మూడు వేల రూ॥లు చెల్లించాలి.
- ఉద్యోగాల ఇంటర్వ్యూలకు ఉచిత బస్‌పాస్‌లు ఇవ్వాలి.
- ఇంటర్వ్యూల సందర్భంగా ఉచిత వసతి కల్పించాలి.
- అశ్లీల చిత్రాలను నిషేదించాలి. పకడ్బందీగా సెన్సార్ బోర్డును ఏర్పాటు చేయాలి.
- గ్యాస్ ధరలను తగ్గించాలి.
- పని స్థలాల్లో లైంగిక వేధింపులు నిరోధించేందుకు సుప్రీం కోర్టు మార్గదర్శక సూత్రాలను ఖచ్చితంగా అమలుపరచాలి.
- బస్తీలలో చైన్ స్నాచర్స్‌ను, దోపిడీ దొంగలను పట్టుకునేందుకు నిఘా పెంచాలి.
- పోలీస్ స్టేషన్లను కాలనీల్లో ఏర్పాటు చేయాలి.
- నిరుద్యోగులకు ప్రత్యేక హాస్టల్స్ ఏర్పాటు చేసి ఇవ్వాలి.
- హీన సంస్కృతిని ప్రవేశపెట్టే టెలి సీరియల్స్‌ను,సినిమాలను నిషేదించాలి.
- ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలి.
- మండలానికో స్పోర్ట్స్ హాస్టల్ ఏర్పాటు చేయాలి. క్రీడా మైదానాలను ఏర్పాటు చేయాలి.
- ప్రతి సంవత్సరం ఉద్యోగాలకు నోటిఫికేషన్స్ ఇవ్వాలి.
- ఉచిత విద్య, ఉచిత వైద్యం ఇవ్వాలి.
- వడ్డీలేని రుణాలు ఇవ్వాలి. గ్రూపులకు 10 లక్షలు, వ్యక్తిగతంగా 5 లక్షలు రుణాలు ఇచ్చి వారు చేసిన ఉత్పత్తికి మార్కెట్ కల్పించాలి.



- చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను ప్రభుత్వ హాస్టళ్ళకు, విద్యా సంస్థలకు యూనిఫాంగా చేయాలి. తద్వారా మార్కెట్ కల్పించాలి.
- విద్యా వలంటీర్స్ వేతనాలు, హోమ్‌గార్డు వేతనాలు, వయోజన విద్యా ప్రేరక్‌ల జీతాలు పెంచాలి. క్రమం తప్పకుండా జీతాలు ఇవ్వాలి.
- సమగ్ర యువజన పాలసీని అమలు చేయాలి.
- ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి.

## విద్యారంగం

పాఠశాలలో ప్రవేశించిన ప్రతి 100 మంది పిల్లలలో 27 శాతం మంది పిల్లలు 6వ తరగతికి చేరలేకపోతున్నారు. 43 మంది 7వ తరగతికి చేరకముందే డ్రాపవుట్ అవుతున్నారు. మరియు 64 మంది 10వ తరగతికి చేరకముందే పాఠశాలలను వదులుతున్నారు. మరియు ముఖ్యంగా 48 మంది షెడ్యూలు కులాలవారు 68 మంది షెడ్యూలు తెగలవారు పాఠశాలలను వదులుతున్నారు.

1. అన్ని జనావాస ప్రాంతాలలో పాఠశాలలు ఏర్పాటుచేసి అన్ని పాఠశాలలకు సరిపోను తరగతి గదులు నిర్మించాలి.
2. అన్ని పాఠశాలలకు త్రాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు మరియు మూత్రశాలలు నిర్మించాలి.
3. అన్నిరకాల వసతి గృహాలలో పూర్తిస్థాయి సిబ్బంది (HWO, Tutors, Cooks, Watchmens)ని నియమించి మెరుగైన సౌకర్యాలతోబాటు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించి విద్యార్థులు గుణాత్మక విద్యనభ్యసించేలా తీర్చిదిద్దాలి.
4. "ఉచిత, నిర్బంధ ప్రాథమిక విద్యాహక్కు 2008" బిల్లుని చట్టంగా రూపొందడానికి కేంద్రంలో కృషి చేయాలి.
5. ప్రతి పాఠశాలలో సబ్జెక్టువారీగా ఉపాధ్యాయులను నియమించి, గుణాత్మక విద్యను అందించాలి. వ్యాయామ, డ్రాయింగ్ మరియు క్రాఫ్ట్ ఉపాధ్యాయులను నియమించాలి.
6. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి. విద్యాసౌకర్యాలు మెరుగుపరచాలి.
7. ప్రతి మండల కేంద్రంలో జూనియర్ కళాశాల, డివిజన్ కేంద్రంలో డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి.
8. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కళాశాలల్లో ఖాళీగావున్న అధ్యాపక పోస్టులు పాఠశాలల్లో ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలి.
   పాఠ్య గ్రంథాలను సంవత్సరారంభంలో విద్యార్థులకు అందుబాటులో ఉండాలి.
9. బి.సి, ఎస్.సి, ఎస్.టి. విద్యార్థులకు ప్రతి నియోజకవర్గ కేంద్రంలో స్టూడెంట్ మేనేజ్‌మెంట్ వసతి గృహాలు ఏర్పాటు చేయాలి.

10. పెరుగుతున్న ధరల కనుగుణంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, మెస్‌ఛార్జీలు పెంచాలి.
11. కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణ చట్టం, కామన్ ఫీజు విధానం తీసుకురావాలి.
12. హాస్టల్స్‌కు పక్కా భవనాలు నిర్మించి, ఖాళీగావున్న వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలి.
13. రాష్ట్రంలో ప్రైవేట్ యూనివర్శిటీలు, కేంద్రంలో విదేశీ యూనివర్శిటీలు బిల్లును వెనక్కి తీసుకుని ప్రభుత్వ యూనివర్శిటీలు పరిరక్షించాలి.
14. యూనివర్శిటీలలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు రద్దుచేస్తూ పరిశోధనా (పిహెచ్‌డి) విద్యార్థులకు ఫిలోషిప్ స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలి.
15. పాఠశాల విద్యలో సెంట్రల్ సిలబస్ కాకుండా కామన్ విద్యావిధానం తేవాలి.
16. పాలిటెక్నిక్ కళాశాలలో ఐటిఐలను నెలకొల్పాలి.
17. కొత్తగా ఏర్పాటుచేసిన ప్రభుత్వ యూనివర్శిటీలకు పూర్తిస్థాయిలో బడ్జెట్ కేటాయించాలి.
18. ఇంటర్ బోర్డును స్వతంత్ర సంస్థగానే కొనసాగించాలి.
19. మధ్యాహ్న భోజనం పథకానికి నిధులు పెంచి, పౌష్టికాహారం సక్రమంగా అందే విధంగా చర్యలు తీసుకోవాలి.
20. కొఠారి కమిషన్ సిఫారసులు అమలు చేయాలి.
21. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా స్పోర్ట్స్ హాస్టల్స్ ఏర్పాటు చేయాలి.
22. ప్రతి మండలంలో విధిగా జూనియర్ కాలేజి ఏర్పాటు చేయాలి.
23. విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి. డొనేషన్ల పద్ధతికి స్వస్తి చెప్పాలి. ప్రైమరి, మాధ్యమిక విద్యార్థుల పుస్తకాల బరువుమోత తగ్గించాలి.
24. విద్యాలయాల్లో ర్యాగింగ్‌పైకఠిన చర్యలు తీసుకోవాలి.
25. విద్యాలయాల్లో ప్రజాస్వామ్య పద్ధతుల్లో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు జరపాలి.

## ఎయిడ్స్

సమాజంలో చాపకింద నీరులా వ్యాపిస్తున్న మానవ వనరుల అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్న హెచ్ఐవి ఎయిడ్స్ నిర్మూలన అంశానికి ప్రాధాన్యత ఎంతో సంతరించుకొంది. ఎయిడ్స్ కేవలం ఒక బాదిత వ్యక్తి ఆరోగ్య సమస్యకాదని, అతని కుటుంబం యావత్తు సమాజ సమస్యగా గుర్తించి దీని నిర్మూలనకు రాజకీయ సిద్ధాంత విభేధాలను దూరంపెట్టి కృషి చేయాల్సివుంది.

- బాధితులకు మరియు వారి పిల్లలకు ఉచిత విద్యావకాశాలు, బస్‌పాస్ సౌకర్యం కల్పించాలి.
- సరసమైన ధరలకు మందుల సౌకర్యం కల్పించాలి.
- బాధితులకు కనీసం రూ. 1000/-లు పెన్షన్ ఇవ్వాలి.



- దీని నిర్మూలనకు మురికివాడల్లో, హైవే రోడ్లలో, ఫైవ్‌స్టార్ హోటళ్ళవద్ద, లాడ్జీలవద్ద, సినిమా థియేటర్లవద్ద ప్రచార కార్యక్రమాలు చేపట్టాలి.
- వివాహానికి పూర్వం దంపతులిద్దరికి హెచ్ఐవి పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలి.

## దళిత సామాజిక వర్గాల పరిరక్షణకు సిపిఐ హామీ

- దళిత ప్రజలలో కొన్ని ప్రత్యేక అంశాలపై అబద్రతాభావం ఏర్పడి అశాంతి, ఆవేదనకు కొందరు దళితులు గురి అవుతున్నారు. ఆవేశపూరిత ఆందోళనలకు, ఆత్మహత్యలకు పాలుపడుతున్నారు.
- దేశానికి స్వాతంత్ర్యం సాధించబడి 67 సంవత్సరాలు పూర్తి కావస్తున్నా దళితుల పట్ల తీవ్ర కుల వివక్ష కొనసాగించబడుతున్నది. పేదరికం, దారిద్ర్యం, కుల వివక్షత, అంటరానితనం, అత్యాచారాలు, మానభంగాలు, దళితులపై దాడులు, దౌర్జన్యాలు అను నిత్యం సాగుతూనే ఉన్నాయి. యస్‌సి-యస్‌టి అట్రాసిటీస్ చట్టం అమలులో ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదు. అతి తక్కువగా నమోదు చేసినా ఈ కేసులకు సంబంధించిన చార్జిషీటును పోలీస్ అధికారులు కోర్టులకు దఖలు చేయడంలేదు. నేరస్తులకు శిక్షలు పడటం లేదు. మరొకవైపు ప్రభుత్వాలు బడ్జెట్‌లో కేటాయించిన నిధులను, సంక్షేమ పథకాల నిధులను ప్రభుత్వమే దారిమళ్ళిస్తున్నది. ఇతర డిపార్టుమెంటులకు దళితుల కోసం కేటాయించిన నిధులు తరలిస్తున్నది. యస్‌సి కాంపోనెంటు విధి విధానాలు అమలుజరపటంలో పాలక ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందాయి. వర్గీకరణ అంశాన్ని సాధ్యమైనంత త్వరలో సామరస్యంగా పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఉంది. ఈ నేపథ్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) దళితుల సామాజికవర్గాల ప్రయోజనాల కొరకు వారి హక్కుల పరిరక్షణకు అకుంఠిత దీక్ష, పట్టుదలతో కృషి చేయగలమని పోరాటాలు సాగిస్తామని స్పష్టం చేస్తున్నాము.
- దళితుల బడ్జెట్ నిధులను, సంక్షేమ పథకాలను అమలు జరుపుటకు చట్టబద్ధత కలిగిన ప్రత్యేక యంత్రాంగాన్ని నియమించాలి.
- దళితులకు ఉప ప్రణాళికను ఖచ్చితంగా అమలు జరపాలి.
- పెరిగిన జనాభాకు అనుగుణంగా బడ్జెట్‌లో దళితులకు నిధులు కేటాయించాలి.
- అన్ని రంగాలలో విద్యా, వైద్య, వ్యవసాయ, రవాణా, పారిశ్రామిక యూనిట్లతో సహా దళితులకు రిజర్వేషన్లు అమలుజరపాలి.
- ప్రతి దళిత కుటుంబానికి వ్యవసాయానికి అనుకూలమైన ఒక హెక్టారు ప్రభుత్వ భూమిని అందించాలి. ఇంటి స్థలంతో సహా రెండు లక్షల రూ॥లు ఇంటి నిర్మాణానికి మంజూరు చేయాలి.
- ప్రైవేటు రంగంలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు జరుపుటకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చట్ట సవరణలు చేయాలి.

- ఎ,బి,సి, డిల వర్గీకరణ వెంటనే చేయాలి.
- దళిత క్రైస్తవులకు రిజర్వేషన్‌లు కలిగించాలి.
- జనాభా ప్రాతిపదికన అన్ని రంగాలలో రిజర్వేషన్లు అమలు జరపాలి.
- దళితులపై దాడులు, అత్యాచారాలు అరికట్టేందుకు యస్‌సి-యస్‌టి కమీషన్‌కు జ్యుడీషియల్ అధికారాలు ఇవ్వాలి.
- యస్‌సి సబ్‌ప్లాన్ ప్రకారం బడ్జెట్‌లో 16.2 శాతం నిధులను యస్‌సి నోడల్ ఏజెన్సీకి కేటాయించి దళితులకు లబ్ధి చేకూర్చే రంగాలకే ఖర్చు చేయాలి.
- ప్రతి దళితవాడకు రెండు ఎకరాల స్మశాన స్థలం కేటాయించి, ప్రహరీగోడ నిర్మాణం, నీరు, విద్యుత్ రహదారి సౌకర్యాలు కల్పించాలి.
- యస్‌సి-యస్‌టి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలి.
- కాంట్రాక్టు ఉద్యోగాలన్నింటిని రిజర్వేషన్స్ ప్రకారం భర్తీ చేయాలి.
- న్యాయమూర్తి పదవుల నియామకంలో రిజర్వేషన్లు అమలు చేయాలి.
- కులాంతర వివాహాలు చేసుకున్న వారికి, వారి పిల్లలకు 3% రిజర్వేషన్స్ అమలు చేయాలి. లక్ష రూపాయల ఆర్థిక సహాయం, ఇల్లు ఇవ్వాలి.
- కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఐఐటి, ఐఐయం, నవరత్న కంపెనీలు తదితర 49 సంస్థల్లో యస్‌సి-యస్‌టి రిజర్వేషన్లు రద్దు చేయాలని పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లును ఉపసంహరించాలి.
- రాష్ట్రంలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలి.
- దళితుల పరిశ్రమలకు భూమి, విద్యుత్ ఉచితంగా ఇవ్వాలి. 50 శాతం సబ్సీడీతో వడ్డీలేని రుణాన్ని ఇవ్వాలి.
- దళితులకు స్వయం ఉపాధి పథకాలకు, పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చి రుణాలు ఇప్పించాలి.

## గిరిజనులు

గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు కల్పించటానికి అటవీ హక్కుల చట్టాన్ని పటిష్టంగా అమలుపర్చాలి. అటవీ భూములను సాగు చేసుకుంటున్న గిరిజనేతర పేదలకు కూడా అటవీ హక్కుల చట్టాన్ని వర్తింప చేయాలి. గిరిజనాభివృద్ధికోసం మరిన్ని పాఠశాలలు, హాస్టల్స్ ఈ ప్రాంతాలలో తెరవాలి. గిరిజన ప్రాంతాలలో అటవీ ఉత్పత్తుల ఆధారిత పరిశ్రమలను తెరవాలి. తద్వారా నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి. శిశు విక్రయాలను ఆపాలి. బాల్య వివాహాలను బహుభార్యత్వాలను నిషేధించాలి. జరుగుతున్న అక్రమాలను అరికట్టాలి. గిరిజన సంక్షేమ పథకాలు తండాలవద్దకు చేరాలి. విస్తరిస్తున్న విష జ్వరాలను అరికట్టుటకు సంచార వైద్యశాలల వ్యవస్థను పటిష్టపరచాలి. ఈ ప్రాంతాలలో గిరిజనేతర భూముల క్రయ, విక్రయాలను అనుమతించాలి. ఈ ప్రాంతాలలో వ్యవసాయం చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలి. పోడుభూముల నుండి గిరిజనులను వెళ్ళగొట్టే



ప్రయత్నాలను ప్రభుత్వం ఆపాలి. అభివృద్ధేతర పరిశ్రమల స్థాపన సందర్భంగా భూమి కోల్పోయిన గిరిజనులకు తగు నష్టపరిహారం చెల్లించాలి. కొండ ప్రాంతాలలో చెక్‌డ్యాములను నిర్మించి సాగునీరు, త్రాగునీరు సక్రమంగా అందచేయాలి. అటవీ ఉత్పత్తులను నేరుగా గిరిజన కార్పొరేషన్ కొనుగోలు చేయాలి. మధ్యదళారీలను నివారించాలి. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి. అలాగే ఖనిజాన్వేషణ, ఖనిజాభివృద్ధిని ప్రైవేటురంగాలకివ్వగూడదు.

**డిమాండ్స్:**

- ప్రాజెక్టులు, పరిశ్రమల స్థాపన సందర్భంగా భూములు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయంగా భూమిని, అలాగే ఎకరానికి పది లక్షల రూపాయల నష్టపరిహారం, ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించాలి.
- విద్యాలయాల మరియు మెడికల్ సిబ్బందికి క్వార్టర్స్ కేటాయించాలి.
- వృత్తి కోర్సులు ముఖ్యంగా కంప్యూటర్ కోర్సులను కూడా ఈ ప్రాంతాల్లో నేర్పించాలి.
- ప్రతి డివిజన్‌లో గిరిజన రెసిడెన్సియల్ స్కూల్స్ ఏర్పాటు చేయాలి.
- క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలి.
- గిరిజన ప్రాంతాల్లో డిగ్రీ, మెడికల్, ఇంజనీరింగ్, బి.ఎడ్ కళాశాలలను ఏర్పాటు చెయ్యాలి.
- అరకులో ప్రత్యేక గిరిజన విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలి.
- గిరిజన విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలి.
- గిరిజనులకు ప్రధానంగా వయోజన విద్యను ప్రోత్సహిస్తూ సత్వర చర్యలు చేపట్టాలి.
- గిరిజన ప్రాంతంలోని వైద్యశాలల్లో అవసరమైన మందులు, ఇతర పరీక్షలకు అవసరమైన వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలి. సంచార వైద్య శాలలు ఏర్పాటు చేయాలి.
- గిరిజనులకు ప్రత్యేకంగా మెటర్నిటి ఆరోగ్య కేంద్రాలను మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయాలి.
- విష జ్వరాలు వంటి తీవ్రమైన వ్యాధులు సోకకుండా ఎప్పటికప్పుడు ప్రత్యేక వైద్య దళాలను నియమిస్తూ, ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి.
- సీలింగ్ పరిమితికి ఉన్న భూములను స్వాధీనపరుచుకుని, వాటిని భూమిలేని అన్ని ప్రాంతాల్లోని ఆదివాసులకు, గిరిజనులకు పంచాలి.
- అటవీ ఉత్పత్తిదారులుగా ఆదివాసులే ఉండాలి. అటవీశాఖ నిరంకుశత్వాన్ని నిరోధించాలి. అటవీ ఉత్పత్తులు మార్కెటింగ్‌లో దళారీతనాన్ని తొలగించాలి.
- సమగ్రమైన, నిర్ధిష్టమైన పునరావాస పథకాలు లేకుండా గిరిజనుల్ని నిరాశ్రయులను చేసే ఏ ప్రాజెక్టులు, పథకాలను అమలు జరపరాదు. ఈ కోణంలో ఇప్పటికే నిరాశ్రయులైన బాధితులకు యుద్ధ ప్రాతిపదికన పునరావసం కల్పించాలి.
- గిరిజనుల భూములకు, సాగు చేస్తున్న గిరిజనులకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలి. చట్టబద్ధత కల్పించాలి. 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలుపరచాలి.

- గిరిజనుల ప్రాంతాల్లోని గనుల త్రవ్వకాల్లో స్థానిక గిరిజనులకే అవకాశం కల్పించి, లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలి.
- మారుమూల ఆదివాసి గూడేలకు సైతం రహదార్లు, రవాణా సౌకర్యం కల్పించాలి.
- అటవీ, మైదానం ప్రాంతంలలోని ప్రతి గిరిజన కుటుంబానికి పక్కా గృహాలు నిర్మించాలి.
- గిరిజన గృహాల మరమత్తులకు తక్షణం ఆర్థిక సహాయం అందించాలి.
- పొట్టచేత పట్టుకుని వలస జీవితాలే గత్యంతరంగా మారిన గిరిజనులకు యుద్ధ ప్రాతిపదికన జీవనోపాధి ఏర్పాటు చేయాలి.
- ప్రతి గిరిజన కుటుంబానికి పక్కా గృహ నిర్మాణం కొరకు అందిస్తున్న ఆర్థిక సహాయం రెండు లక్షల రూపాయలకు పెంచాలి.
- ప్రతి గిరిజన కుటుంబానికి విధిగా ఐదు ఎకరాల వ్యవసాయ భూమిని ఏర్పాటు చేయాలి.
- ప్రతి జిల్లా కేంద్రంలో గిరిజన భవన్ నిర్మాణాలను చేపట్టాలి.
- ఐటిడిఎలలో అవినీతికి తావుండరాదు. అందు కొరకు గిరిజన ఐక్య వేదిక ప్రతినిధులతో పాటు ప్రభుత్వాదికారుల స్థాయిలో ప్రత్యేక కమిటీలను నియమించాలి.
- గిరిజన సంస్కృతులు, సాంప్రదాయాలు, భాషలను పరి రక్షించాలి.
- గర్భస్థ మరణాలు జరగకుండా యుద్ధ ప్రాతిపదికన సత్వర చర్యలు చేపట్టాలి.
- కాగితాలకే పరిమితమయ్యే పథకాలకు కాలం చెల్లిపోవాలి. ప్రతి ప్రణాళికలో, పరిపాలనా వ్యవహారంలో గిరిజన సంఘ ప్రతినిధులకు ప్రాధాన్యత కల్పించి, అందరూ కోరుకునే

కట్టాలి.

గా యస్టి కమీషన్‌ను ఏర్పాటు చేయాలి.

-
- గిరిజన సంక్షేమ పథకాలకు, అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలి. ఈ నిధులను ఇతర మార్గాలవైపు మళ్ళించరాదు. మిగులు నిధులను కొరతపడిన గిరిజన అభివృద్ధి పథకాలకు మాత్రమే మళ్లించి, వినియోగించాలి.
- ప్రతి గ్రామ పంచాయితీ, మండల స్థాయిల్లో గిరిజన గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలి

## ముస్లిం మైనారిటీలు

1. సచార్‌కమిటీ, రంగనాథ్ మిశ్రా కమిటీల ప్రతిపానలను అమలు పరచాలి.
2. సచార్‌కమిటీ ప్రతిపాదన మేరకు మైనారిటీల సామాజిక, ఆర్థిక పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నందున, మైనారిటీలకు ఉప ప్రణాళిక పొందుపరచి, చట్టబద్ధం చేయాలి.
3. కనీసంగా 10,000 కోట్ల రూపాయలు మైనారిటీల అ వృద్ధికై కేటాయించాలి.
4. విద్యా, ఉద్యోగాలలో 5% స్లింలకు కల్పించాలి.
5. బాలబాలికలకు ప్రత్యేకమైన రిటీలు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఏర్పాటు చేయాలి.
6. జాతీయ మైనారిటీల కమిషన్ ప్రతిపాదన మేరకు సెక్యూరిటీ ఏజన్సీలలో, పోలీసుశాఖలోను 25% రిజర్వేషన్‌లు కల్పించాలి.
7. వక్ఫ్ బోర్డ స్థానంలో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కమిషనరేట్‌కు జ్యుడీషియల్ అధికారాలుండాలి.
8. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలి. ఆస్తులను అభివృద్ధి చేయాలి. వక్ఫ్ భూములను భూసేకరణ చట్టం నుండి మినహాయించాలి.
9. ఉర్దూ మాట్లాదేవారు అధికంగావున్న జిల్లాలలో ఉర్దూను రెండవ అధికారభాషగా ప్రకటించాలి.
10. విడాకులు పొందిన, అశ్రద్ద చేయబడిన మహిళలకు భరణం ఇవ్వాలి.
11. కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి వడ్డీలేకుండా కనీసం లక్ష రూపాయల ఋణసదుపాయం కల్పించాలి.
12. ఇంటర్వ్యూ ఫ్యానెల్స్, బోర్డులలో విధాన నిర్ణయ కమిటీలతో ముస్లిం ప్రముఖులకు స్థానం కల్పించాలి.
13. ముస్లిం బాలికలకు విద్యా అవకాశం కల్పించాలి.
14. ముస్లిం బాలికలకు ఉద్యోగావకాశాలు, రుణ సౌకర్యాలు, మార్కెటింగ్, వృత్తి విద్యా ట్రైనింగ్, నాయకత్వం ట్రైనింగ్, స్కిల్ డెవలఫ్‌మెంటు, ప్రత్యేకంగా కుటీర పరిశ్రమలను ప్రోత్సహించాలి.
15. పైలెట్ పథకాలను మైనారిటీ మహిళలకు స్త్రీ–శిశు సంక్షేమ శాఖ ద్వారా వర్తింపజేయాలి. కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలలో అర్హులైన మైనారిటీలందరిని లబ్ధిదారులను చేయాలి.

## వృత్తిదారుల సమస్యలు

రాష్ట్రంలో వివిధ వృత్తులపై కోట్లాదిమంది ఆధారపడి జీవిస్తున్నారు. సంప్రదాయకంగా 59 రకాల వృత్తులు ఉన్నాయి. ఉత్పత్తివృత్తులు, సేవావృత్తులు, సాంస్కృతిక వృత్తులు (వృత్తికళాకారులు)గా వర్గీకరించవచ్చు. అత్యధికులు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. వృత్తి పనివారలయిన, చేనేత, గీత, గొర్రెల పెంపకం, రజకులు, స్వర్ణకారులు, వడ్డెర, కమ్మరి, కుమ్మరి, వృత్తి కళాకారులు, వడ్రింగి, కంచర, శిల్పి ఇతర అనేక గ్రామీణ వృత్తులకు స్వయం సమృద్ధి, స్వయం ఉపాధికి హామీ. చేపల పట్టువృత్తి, చాపలు, బుట్టలు అల్లికలు మొదలయిన సాంప్రదాయక వృత్తుల రక్షించాలి. ప్రపంచీకరణ విధానాలవలన రోజురోజుకు వృత్తులు కునారిల్లుతున్నాయి. వృత్తుల రక్షణ, వృత్తిదారుల సంక్షేమాన్ని కాపాడాల్సిన ప్రభుత్వమే నిర్లక్ష్యం చేస్తుంది. వృత్తి వ్యతిరేక విధానాలను అవలంభించి ఉపాధి దెబ్బతీస్తుంది. వృత్తుల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంలేదు. వాటి ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం లేకుండా చేసి బహుళజాతి సంస్థల ఉత్పత్తులను ప్రోత్సహిస్తుంది.

ఆత్మహత్యలు చేసుకొన్న వారిలో అత్యధికులు చేనేత కార్మికులే. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వటంలేదు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి బ్రతుకు భారంగా మారింది. ఉత్పత్తిచేసిన వస్తువులకు మార్కెట్ సౌకర్యం లేదు. చేసిన శ్రమకు తగిన ప్రతిఫలం రావటంలేదు. కనీస వేతనం అమలు జరగటంలేదు. సమస్యలపై ఆందోళనచేస్తే అణిచివేస్తుంది. ఏటా ప్రభుత్వానికి వచ్చే వేల కోట్ల రూపాయల ఆదాయంలో 1000 కోట్లు (2%) కేటాయించి పంచవృత్తిదారులకు ఉపాధి అవకాశం కల్పించాలి. వృత్తుల పరిరక్షణ కార్యక్రమం చేపట్టాలి. వృత్తిదారుల వర్క్‌షాపులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి. పంచవృత్తుల ఉత్పత్తిలో బహుళజాతి కంపెనీల ప్రవేశాన్ని నిషేధించాలి. ప్రమాదానికి గురైన వారికి నెలకు 2500/- పెన్షన్ చెల్లించాలి.

**డిమాండ్స్:**

1. వెనుకబడిన తరగతుల వారికి ఉప ప్రణాళికను అమలు చేయాలి.
2. జనాభా ప్రాతిపదికన వృత్తిదారులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి.
3. వృత్తిదారుల సమస్యల అధ్యయనానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలి.
4. వృత్తుల నిర్వహణకు అవసరమైన ముడిసరుకులను సరసమైన ధరలకు అందించాలి.
5. ప్రతి వృత్తిదారునికి లక్ష రూపాయలు, 50 శాతం సబ్సిడీతో రుణ సౌకర్యం కల్పించాలి.
6. కరెంటుతో నిర్వహించే వృత్తులకు అవసరమైన కరెంటును ఉచితంగా ఇవ్వాలి.
7. వృత్తులవారీగా రాష్ట్ర ఫెడరేషన్లు ఏర్పాటుచేసి బడ్జెట్‌లో నిధులు కేటాయించి వారి సంక్షేమానికి ఖర్చుచేయాలి.
8. వృత్తి మహిళా సొసైటీలను ఏర్పాటుచేసి జీవనోపాధి కల్పించాలి.
9. ప్రమాదవశాత్తు మరణించిన వృత్తిదారులకు ఎక్స్‌గ్రేషియో రూ. 5 లక్షలు చెల్లించాలి.
10. ప్రతి కుటుంబానికి 21/2 ఎకరాల మాగాణి లేదా 5 ఎకరాల మెట్టభూమి ఇవ్వాలి.
11. అన్ని రకాల వృత్తుల నిర్వహణకు అవసరమైన భూమిని కేటాయించాలి.
12. గతంలో వృత్తిదారులకు ఇచ్చిన ఇనాం భూములకు పట్టాలు ఇవ్వాలి.
13. వృత్తిదారులపై వేసే ప్రత్యక్ష పరోక్ష పన్నులు రద్దుచేయాలి.
14. వృత్తిదారులు గతంలో తీసుకున్న రుణబకాయిలను అన్నింటిని రద్దుచేయాలి.
15. చేతివృత్తుల ఉత్పత్తులలోకి బహుళజాతి సంస్థలను నిషేధించాలి.
16. వృత్తుల రక్షణకు కేటాయించిన రిజర్వేషన్ల చట్టాలను అమలుచేయాలి.
17. దరఖాస్తుచేసుకున్న ప్రతి బి.సి. విద్యార్థికి స్కాలర్‌షిప్, ఫీజ్ రియంబర్స్‌మెంట్ ఇవ్వాలి.
18. 3 నుండి 10వ తరగతివరకు బాలబాలికలకు ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటుచేయాలి.
19. ఇంటర్ నుండి డిగ్రీవరకు హాస్టల్ అటాచ్డ్ కాలేజీలద్వారా ఉన్నతవిద్యను అందించాలి.
20. ప్రైవేట్ విద్యా ఉపాధి రంగాలలో బి.సి.లకు రిజర్వేషన్లు అమలు జరపటానికి చట్టాన్ని తీసుకురావాలి.



21. వృత్తిదారుల కార్పొరేషన్లు–ఫెడరేషన్లకు ప్రజాస్వామ్య పద్ధతులలో ఎన్నికలు నిర్వహించి సహకార రంగాన్ని బలపర్చాలి.
22. పేదల సంక్షేమ పథకాల, ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీలపై గత ప్రభుత్వం తెచ్చిన జిఓ నెం 101ని ఎత్తివేసి, సంక్షేమ పథకాలపై వయోపరిమితి లేకుండా ప్రభుత్వ పథకాలు పొందే అర్హత కల్పించాలి.

## సఫాయి కర్మచారులను ఆదుకోవాలి

మలాన్ని ఎత్తి బకెట్లతో ఎత్తుకు పోయే సఫాయి కర్మచారులు మన రాష్ట్రంలో ఇంకా ఉండటం దురదృష్టకరం. ఇలాంటి అమానవీయ పనులను నిషేదిస్తూ 1993లో చట్టం చేయబడింది. ఈ పద్ధతిని నిర్మూలించడానికి పునరావాస కార్యక్రమంలో భాగంగా ఐదు లక్షల రూపాయలను ఒకొక్కరికి మంజూరు చేయాలి. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలలో వీరికి అన్ని జాతుల కంటే ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. అలాగే విధిగా ప్రతి ఇంటికి మరుగుదొడ్డి సౌకర్యం కల్పించాలి.

## రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలి

మనకు ఉన్న అతి ప్రాచీన సేవా వృత్తుల్లో రజక వృత్తి కూడా ఒకటి. రాష్ట్రంలో 30 లక్షల మందికి పైగా రజకులు ఉన్నారు. వీరిలో 95 శాతానికి పైగా రజకవృత్తిమీదే ఆధారపడి జీవిస్తున్నారు. కాని నేటికి రజకుల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడిలాగానే ఉంది. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఇప్పటికీ అణగారిన వర్గంగానే ఉంటున్నారు.

గత ఐదారు సంవత్సరాల్లో రజకులపై అనేక గ్రామాల్లో సాంఘిక బహిష్కరణలు, దాడులు, అత్యాచారాలు జరిగాయి. ఇవన్నీ వెలుగులోకి వచ్చినవి మాత్రమే. ప్రతి రోజూ వృత్తిలో భాగంగా ఎదుర్కొనే చీదరింపులు కోకొల్లలు.

నూతన ఆర్థిక విధానాల పేరుతో ప్రభుత్వాలు రజకుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయి. నీటి ప్రైవేటీకరణ సెజ్‌లు, రియల్ ఎస్టేట్‌వల్ల రజకుల మనుగడే ప్రశ్నార్థకంగా ఉంది. అభివృద్ధి కోసం ఉద్దేశించిన అనేక జీవోలు అమలుకాకుండా పోతున్నాయి. రజక సహకార సంఘాల సమాఖ్య (వాషర్‌మెన్ ఫెడరేషన్) నిధులు కేటాయింపు తప్ప ఖర్చు పెట్టడం లేదు.

**డిమాండ్స్:**

1. రజకులను 17 రాష్ట్రాలలో ఎస్.టి.లుగా గుర్తించడం జరుగుతుంది. అలాగే మన రాష్ట్రంలో ఎస్.టి.లుగా గుర్తించి, రజకులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు, సాంఘిక బహిష్కరణలను అరికట్టడానికి ఎస్.సి, ఎస్.టి. (అట్రాసిటీ యాక్ట్) మాదిరిగా రజకులకు కూడా సామాజిక రక్షణ చట్టం తీసుకురావాలి).
2. ఇనాం భూములు, వృత్తి చెరువులపైన రజకులకే హక్కు వుండాలి. పట్టాలు ఇవ్వాలి.
3. ప్రతి కుటుంబానికి రెండున్నర ఎకరాల మాగాణీ లేదా ఐదెకరాల మెట్టభూమి ఇవ్వాలి.

4. పెరిగిన ధరలకు అనుగుణంగా రజకులకు (జీతాలు), ఇస్త్రీ ధరలు పెంచే విధంగా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి.
5. ఇళ్ల స్థలాలు, ఇళ్ళు నిర్మించి ఇవ్వాలి. కమ్యూనిటీ హాళ్లు ఏర్పాటు చేయాలి.
6. ఆధునిక పనిముట్లు అందించాలి. మొబైల్ లాండ్రీలు, వాషింగ్ ప్లాంట్‌లు, వాషింగ్ మిషన్లు, డ్రై మిషన్ల కొనుగోలుకు రుణ సహాయం అందించాలి. వాషింగ్ టెక్నాలజీ కోర్సును ఏర్పాటుచేసి నిష్ణాతులను తయారుచేయాలి.
7. ప్రతి గ్రామంలో దోభీఘాట్లు నిర్మించాలి. దోభీఘాట్లన్నింటికీ ఉచిత కరెంట్ ఇవ్వాలి.
8. ఇస్త్రీకి వాడే బొగ్గును, ముడి సరుకులు (సర్ఫ్‌లు, సబ్బులు, సోడా, టినోపాల్, బ్లీచింగ్‌లను) సబ్సిడీపై ఫెడరేషన్ ద్వారా అందించాలి.
9. రజక ఫెడరేషన్‌కు ప్రత్యేక మేనేజింగ్ డైరెక్టర్ (ఎం.డి)ని నియమించాలి. సహకార వ్యవస్థను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలి.
10. ప్రతి సొసైటీకి 50 శాతం సబ్సిడీతో పావలా వడ్డీ రుణం తక్షణమే అందజేయాలి. ఫెడరేషన్‌కు 100 కోట్లు బడ్జెట్ కేటాయించాలి.
11. రజకవృత్తిదారుల పిల్లలకు విద్యనందించేందుకు ప్రతి మండలానికి ఒక ప్రత్యేక ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయాలి. ఇంటర్ నుంచి డిగ్రీ వరకు ఉచిత హాస్టల్ సౌకర్యం కల్పించాలి.
12. రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. రజకులందరికీ ఉచిత జీవితబీమా సౌకర్యం కల్పించాలి.
13. రజక వృత్తిదారులందరికీ వృద్ధాప్య పెన్షన్, వితంతు పెన్షన్ రూ. 1000/-లు చెల్లించాలి.

## గీతవృత్తిదారులు

గీతవృత్తిదారులు ఉద్యమాలుచేసి సాధించుకున్న వన పెంపకంకు 5 ఎకరాలు ప్రభుత్వభూమి కేటాయించాలని జి.ఒ.ను అమలుచేయలేదు.

రాష్ట్రంలో లిక్కర్ కంపెనీలతో మిలాఖతై కల్తీబూచితో డా॥ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం కల్లుగీత వృత్తిదారులను తన పరిపాలనలో సవతితల్లి ప్రేమతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ గీత పనివారల సంఘం, గీతవృత్తి సంఘాలు ఐక్యంగా పోరాటాలు నిర్వహించినప్పటికి వామపక్ష పార్టీలు అన్ని పార్టీలచేత వృత్తి ఉద్యమాలకు మద్దతుగా నిలిచినప్పటికి ప్రభుత్వం గీతవృత్తి వ్యతిరేకతను కొనసాగిస్తూ చీప్ లిక్కర్ బెల్టుషాపులను కొనసాగిస్తూ గ్రామీణ వృత్తుల ఎడల పూర్తిగా నిర్లక్ష్యాన్ని వహించింది. మూసిన కల్లు దుకాణాల పునరుద్ధరణ ఎక్స్‌గ్రేషియో ప్రభుత్వం ద్వారా అమలు, వన పెంపకంకు భూమి జి.ఓ. అమలు ఆర్థిక కార్పొరేషన్‌కు రు. 100 కోట్ల కేటాయింపు, గృహ, ఆరోగ్యశ్రీ, వృద్ధాప్య పెన్షన్ పథకాల ప్రత్యేక వర్తింపు కార్యక్రమాలను చేపట్టాలి.



## చేనేత రంగం

ప్రపంచీకరణ ఫలితంగా చేతివృత్తులు అంతరించి పోతున్నాయి. అందులో భాగంగా చేనేతరంగం సైతం అంతరించిపోతుంది. అగ్గిపెట్టెలో ఇమడ్చగలిగిన చీరలను తయారుచేసి ఎగుమతులు చేసిన ప్రపంచ ప్రసిద్ధిగాంచిన రాష్ట్రం మనది. అలాంటి ఈ రంగం ఈనాడు సంక్షోభానికి గురైంది. వేలాదిమంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు, ఆకలిచావులకు గురయ్యారు. క్షయ, ఇతర ఛాతికి సంబంధిత వ్యాధులకు గురవుతున్నారు. దీనికి తోడు చక్రవడ్డీ కట్టలేక అప్పులబాధలు వీరిని వెంటాడి ఆత్మహత్యలకు గురి చేయడం జరుగుతున్నది. వీరికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు జరగాలి. స్వల్ప వడ్డీతో కూడిన ఋణాలు వీరికి ఇవ్వాలి. మగ్గాలపై పనిచేసే కార్మికుల వేతనాలు పెంచాలి. నేతన్నలను బలహీనవర్గాలుగా గుర్తించి గృహ సౌకర్యం కల్పించాలి. మన రాష్ట్రంలో తయారైన వస్త్రాలను ఎగుమతులకు ప్రోత్సహించాలి. విదేశీ డంపింగ్‌ను ఆపాలి. ప్రభుత్వరంగంలో విధిగా చేనేత వాడకం పెంచాలి. స్పిన్నింగ్ మిల్లులకు నూలు తయారి కోటా విధించాలి. నూలు, రంగులాంటి ముడిసరుకుల కొరత లేకుండా నేతన్నను ఆదుకోవాలి. మిల్లువస్త్రాలమీద సుంకాలు పెంచి చేనేతకు ఆడబ్బులు కేటాయించి ఆదుకోవాలి. సొసైటీలపై ఉన్న రుణాన్ని మాఫీ చేయాలి. మరమగ్గాల ఆధునీకరణకు రు. 20,000ల చొప్పున కేటాయించి, అలాగే సంఘాలకు వడ్డీ రాయితీ కల్పించాలి.

- సమగ్ర చేనేత విధాన (పాలసీ) ప్రకటన చేయాలి.
- చేనేతను జౌళిని విడదీసి ప్రతి సంవత్సరం చేనేతకు వెయ్యి కోట్ల రూ॥లు బడ్జెట్‌లో కేటాయించాలి. ఖర్చు పెట్టాలి.
- జనతా వస్త్ర పథకాన్ని పునరుద్ధరించాలి.
- 11 రకాల రిజర్వేషన్ 100 శాతం అమలు చేయాలి.
- కనీస వేతన చట్టాన్ని సవరించి అమలు చేయాలి. (సాధారణ పనికి నెలకు పన్నెండు వేల రూపాయల ఆదాయం ఉండాలి)
- ప్రభుత్వమే ప్రతి జిల్లాలో చేనేత పార్కులు ఏర్పాటు చేయాలి.
- చేనేత కేంద్రాలలో వస్త్ర కొనుగోలు, విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసి ముడి సరుకులను సరసమైన ధరలకు అందివ్వాలి.
- ప్రతి నేత కార్మికునికి ప్రభుత్వ గ్యారంటీతో ఒక లక్ష రూ॥ల సబ్సీడీతో రుణం ఇవ్వాలి.
- చేనేత కార్మికులకు లక్ష రూపాయలతో ఉచిత పక్కా ఇల్లు, మగ్గం షెడ్డు నిర్మించి ఇవ్వాలి. వృద్ధులకు రూ. 2500/-ల పెన్షన్ చెల్లించాలి.
- చేనేత అన్ని రకాల రుణాలు మాఫీ చేయాలి.
- ప్రతి కుటుంబానికి రెండు ఎకరాల భూమి ఇవ్వాలి.
- ఉచిత విద్యుత్ ఇవ్వాలి.

## మత్స్యకారులు

రాష్ట్రంలో మత్స్యకారుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారవుతున్నది. నగర, పట్టణ శివార్లలో చెరువులు అదృశ్యమయిపోతున్నాయి. ఉన్న కాస్త చెరువులను కోటీశ్వరులకు రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టుకు అప్పగిస్తే విదేశాలకు ఎగుమతిచేసి లాభాలు గడిస్తున్నారు. వీరిని ఎస్.టి.లుగా గుర్తించాలని అనేక సంవత్సరాలుగా పోరాటం చేయటం జరుగుతున్నది. మత్స్యకారుల సొసైటీలకే చేపలు పట్టే కాంట్రాక్టును అప్పగించాలి. అనేక రసాయన పరిశ్రమలు, చెరువుల సమీపంలో రావడంవల్ల నీరు రసాయన వ్యర్థపదార్థాలతో కలుషితమై చేపలు చనిపోవడం జరుగుతున్నది. ఈనేపథ్యంలో రసాయన వ్యర్థ పదార్థాలను శుద్ధి చేశాకే నీటిలోకి వదలాలి. ఫిషరీస్ డెవలప్‌మెంట్ కోర్సులు విదేశాల్లో మాదిరిగా మన రాష్ట్రంలో ప్రారంభించాలి.

- మత్స్యకార్మికుల కార్పోరేషన్ తగు సహాయం అందజేయాలి.
- మత్స్యకార్మికులకు మరబోట్స్ పూర్తి సబ్సీడీలతో అందచేయాలి.
- మైదాన ప్రాంతాలలో ఉండి చెరువులు, కుంటలలో చేపలు పట్టే వారికి వలలు ఏర్పాటు చేయాలి.
- మత్స్యశాఖ కొలనులను త్రవ్వించాలి.
- చేపలను వ్యాపార కేంద్రాలకు తరలించడానికి రవాణా సౌకర్యాలు కల్పించాలి.
- చేపలు నిల్వ చేయడానికి శీతలీకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి.
- మత్స్య కార్మికుల కుటుంబాలకు, పిల్లలకు వైద్య, విద్య సౌకర్యాలు కల్పించాలి.
- మత్స్య కార్మికులకు పక్కా ఇళ్ళు కట్టించి ఇవ్వాలి.
- తీర ప్రాంత భూములపైన మత్స్య కార్మికులకు హక్కు కల్పించాలి.

## క్షౌరవృత్తిదారులు

ప్రపంచీకరణ ఫలితంగా చేతివృత్తులు అంతరించిపోతున్న నేపథ్యంలో తమ వృత్తినే నమ్ముకొని బ్రతుకునావను ఈడుస్తున్న క్షౌరవృత్తిదారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం వుంది. వివిధ దేవాలయాల్లో తలనీలాల ద్వారా వచ్చిన మొత్తంలో కనీసం సగం ఆదాయాన్నైనా రాష్ట్ర ఫెడరేషన్‌కు కేటాయించి క్షౌరవృత్తిదారుల సంక్షేమానికి కేటాయించాలి. క్షౌరశాలలకు ఉచిత విద్యుత్తును కేటాయించాలి. క్షౌరవృత్తిలోకి రిలయన్స్‌లాంటి గుత్తపెట్టుబడిదారి సంస్థల ప్రవేశాన్ని నిషేధించాలి.

డిమాండ్స్ :

- తలనీలాల టిక్కెట్‌పై వచ్చే ఆదాయం 50% దేవాలయం అభివృద్ధికి, మిగతా 50%లో 40% క్షౌరవృత్తిదారుడికి, 10% క్షౌరవృత్తిదారుడి భవిష్య నిధిగా పి.ఎఫ్. జమచేసి వృత్తి నుండి దిగి పోయినప్పుడు ఇవ్వాలి. అప్పటి వరకు జమ అయిన భవిష్య నిధిని పూర్తిగా చెల్లించే బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలి.
- తలనీలాల వేలంపై వచ్చే ఆదాయం 50 శాతం దేవాలయం అభివృద్ధికి తీసుకోవాలి. మిగతా 50 శాతం క్షౌర వృత్తిదారుల సంక్షేమం కోసం ఖర్చు పెట్టాలి.



- వృత్తి గుర్తింపు కార్డులు ఇవ్వాలి. పర్మినెంటు ఉద్యోగాలు ఇవ్వాలి. సంవత్సరానికి రెండు జతల డ్రస్సులు ఇవ్వాలి.
- మహిళా క్షురకులకు ప్రసూతి సమయంలో సెలవులు ఇచ్చి, ఉద్యోగ భృతి ఇవ్వాలి. ప్రసూతి సమయంలో ఉచిత వైద్య సేవలు అందించాలి.
- దేవాలయంలోని ఇతర ఉద్యోగులకు వర్తించే సౌకర్యాలు, కళ్యాణ కట్ట క్షౌర వృత్తిదారులకూ వర్తింపజేయాలి.
- క్షౌర వృత్తిదారుల పిల్లలకు డిగ్రీ వరకు ఉచిత విద్యనందించాలి. దేవాలయానికి అందుబాటులో నివాస గృహాలు ఇవ్వాలి.

## టైలరింగ్

ప్రపంచీకరణ ఫలితంగా కుప్పలు, తెప్పలుగా రెడీమేడ్ దుస్తులు విదేశాలనుండి డంపింగ్ జరుగుతున్న నేపథ్యంలో టైలరింగ్ షాపులకు గిరాకి లేక ఆకలిచావులకు ఆత్మహత్యలకు గురవుతున్నారు. టైలరింగ్ పార్కులను ఏర్పాటు చేయాలి. వీరిని బలహీనవర్గాలుగా గుర్తించి ఇళ్ళస్థలాలు, పక్కా ఇళ్ళు కేటాయించాలి. ప్రభుత్వరంగ సంస్థలు వీరికి పనులు అప్పచెప్పి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## వడ్డెర వృత్తిదారులు

నగర శివార్లలోను, రాష్ట్రంలోని గ్రామ శివార్లలో, గుట్టలలో ఎండనక, వాననక పనిచేసే వడ్డెరలు ఆకాశహర్మ్యాలకు పునాదులు వేస్తూ, రాళ్ళు పగులగొడుతూ, గుట్టలు తొలుస్తు కండలను కరగదీసే ఈ వర్గాన్ని మానవతా దృక్పథంతో ఆదుకోవాల్సిన అవసరం వుంది. వీరంతా దారిద్ర్యరేఖ దిగువున జీవించడం జరుగుతున్నది. క్వారీలవద్ద, క్రషర్స్‌వద్ద పనిచేసే వీరు అనేక సందర్భాల్లో బ్లాస్టింగ్‌లకు గురికావడం జరుగుతున్నది. క్రషర్స్ నుండి చెలరేగిన దుమ్ము, ధూళి వల్ల అనేక మంది క్షయవ్యాధి బారినపడటం జరుగుతున్నది. వీరిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి.

**డిమాండ్స్:**

1. జనాభా ప్రాతిపదికన వడ్డెర ఫెడరేషన్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి.
2. రాళ్ళు, గుట్టలు, క్వారీలను వడ్డెర కో-ఆపరేటివ్ సొసైటీలకే ఉచితంగా లీజుకు ఇవ్వాలి. ప్రతి వృత్తిదారునికి లక్ష రూపాయలు ప్రభుత్వ గ్యారంటీతో సబ్సిడీ రుణసౌకర్యం కల్పించాలి.
3. ప్రతి వడ్డెర వృత్తిదారుడికి ఆధునిక పనిముట్లు ఇచ్చి ఆదాయాన్ని పెంచాలి.
4. వడ్డెర వృత్తిదారులకు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలి. ప్రతి ఒక్కరికి గుర్తింపుకార్డులివ్వాలి.
5. వృత్తినిర్వహణలో మరణించిన వారికి రూ. 5 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలి.
6. ఇళ్ళస్థలాలు ఇచ్చి ఇళ్ళు నిర్మించి ఇవ్వాలి. అర్హులందరికి వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలి.

## స్వర్ణకారులు

- స్వర్ణకారులపై పోలీసుల దాడులు ఆపాలి.
- రెడీమేడ్ అభరణాలు మార్కెట్‌లో వచ్చినందు వల్ల స్వర్ణకార వృత్తి అంతరించి పోతున్నది.
- స్వర్ణకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.
- స్వర్ణకారులకు ప్రత్యేక అభివృద్ధి బోర్డు, ఆర్థిక కార్పోరేషన్ ఏర్పాటు చేయాలి.

## సంచార జాతులు

బాగా వెనుకబడిన కులాలు (వీశీర్ ఝుఎఝుతీస ఝర్వం) దళిత, గిరిజనులకు ఉన్న రిజర్వేషన్‌ల సౌకర్యం లేకుండా సభ్యసమాజానికి దూరంగా ఉండి బిచ్చమెత్తుకొని, చిన్నచిన్న వృత్తులు చేసుకొంటున్న జాతులు కొన్నింటిని ఎస్.సి, ఎస్.టి.లలో చేర్చి వారికి అన్ని రంగాలలో రిజర్వేషన్‌లు కల్పించి ఆదుకోవాలి. వారికి ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేయాలి. వైద్య సదుపాయాలను సంచార వైద్యశాలల ద్వారా వైద్యాన్ని అందచేయాలి. ఇతర సంక్షేమ పథకాలు వారిదగ్గరికే తీసుకెళ్ళాలి.

## సాంస్కృతికరంగం

మన సంస్కృతికి వారసత్వంగా ప్రజాజీవితాలకు ప్రతిబింబాలైన కళలు క్రమంగా అంతరించిపోతున్నాయి. మరీ జానపద, వృత్తికళలు మరుగునపడిపోతున్నాయి. ఆధునిక కళలకు తగిన ప్రోత్సాహంలేక తిరోగమన దశలో వున్నాయి. ఈ దుస్థితినుండి కళలను కాపాడి కళాకారులను పరిరక్షించవలసిన బాధ్యత నేటి ప్రభుత్వాలపై వున్నది. సాంస్కృతిక రంగానికి కేటాయించే నామమాత్రపు బడ్జెట్ మన ప్రభుత్వాలు ఖర్చు క్రింద చూపుతున్నాయి. మన రాష్ట్ర పాలకులు సాంస్కృతికరంగం అభివృద్ధికి కళాకారుల సంక్షేమానికి ఈ క్రింది చర్యలు తీసుకోవాలి.

1. భారత రాజ్యాంగ సూత్రాల కనుగుణంగా రాష్ట్ర సమగ్ర సాంస్కృతిక విధానం రూపకల్పన జరగాలి.
2. ఈ రంగానికి ప్రతి సంవత్సరం రు. 100 కోట్ల రూపాయలు బడ్జెట్‌లో కేటాయించాలి.
3. ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలి.
4. రాష్ట్రంలో అర్హులైన వృద్ధ కళాకారులందరికి సంఖ్యతో నిమిత్తం లేకుండా నెలకు రు. 5,000/-లు పెన్షన్ అందించాలి.
5. అతి పేద కళాకారులకు ఇండ్లస్థలాలు ఇచ్చి ఇళ్ళు కట్టించాలి.
6. రాష్ట్ర, జిల్లా సాంస్కృతిక మండళ్ళను నిజమైన కళాప్రముఖులతో నింపి సజీవం చేయాలి.
7. సాహితీ, సంగీత, జానపద గిరిజన అకాడమి, లలిత కళా అకాడమీలను ఏర్పాటు చేయాలి.
8. ప్రతి జిల్లా కేంద్రంలో అనువైన థియేటర్లు నిర్మించాలి.
9. మరుగునపడుతున్న జానపద, పౌరాణిక, వృత్తి కళలను కాపాడే చర్యలు తీసుకోవాలి.



10. కళాకారులకు ప్రభుత్వాలు స్వప్రయోజనాలకు వినియోగించక జాతి పునర్వికాసానికి తోడ్పాటునందించాలి.
11. యూనివర్శిటీలన్నింటిలో సంగీత, నృత్య, కళాశాలల్లో "థియేటర్ ఆర్ట్స్' కోర్సులు ప్రవేశపెట్టాలి.
12, ఆర్.టి.సి. బస్సుల్లో కళాబృందాలకు ప్రదర్శనల సందర్భాన ప్రయాణాల్లో రాయితీలు కల్పించాలి.
13. క్రీడారంగానికి ఇస్తున్న ప్రాధాన్యత అన్ని విషయాల్లో సాంస్కృతిక రంగానికి కూడా ఇవ్వాలి.

మన ప్రజల సాంస్కృతికస్థాయిని, చైతన్యాన్ని పెంచడానికి ఛాందసవాద, కరుడుగట్టిన మితవాద భావాలను ఎదుర్కొనడానికి, మతోన్మాద, ఫాసిస్టు దృక్పదానికి వ్యతిరేకంగా లౌకిక ప్రజాస్వామ్య భావాలను పెంపొందించటానికి, అన్నిరకాల దిగజారుడు ప్రభావాలకు వ్యతిరేకంగా నైతిక విలువలు పరిరక్షించటానికి ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

## న్యాయవాదులు

రాష్ట్రంలో వేలాదిమంది న్యాయవాద వృత్తిలో వున్నారు. గతంలో మాదిరికాకుండా ఈ వృత్తిలోకి అన్ని సామాజిక వర్గాలవారు వస్తున్నారు. ప్రధానంగా ఎస్.సి, ఎస్.టి, బి.సి. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలవారికి ప్రభుత్వపరంగా తగు ప్రోత్సాహం ఆర్థిక సహకారం అందించవలసియున్నది. ఈవృత్తిలో అర్హులైన వారందరికి ఇండ్లస్థలాలు, వృద్ధాప్యపు పెన్షన్, ఆరోగ్యశ్రీ పథకాలను వర్తింపచేయాల్సివున్నది. జూనియర్ న్యాయవాదులందరికి 5 సం॥ల కాలం స్టైఫండ్, గ్రంథాల సేకరణకు ఋణ సదుపాయం కల్పించబడాలి. ఇప్పుడు సంక్షేమ నిధిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో 5 లక్షలకు పెంచబడాలి. న్యాయస్థాన ప్రాంగణాలలో కోర్టును ఆశ్రయించేవారికి స్త్రీ, పురుషులకు మౌలిక సదుపాయాలు కల్పించబడాలి.

## ఉగ్రవాద, ఫ్యాక్షనిస్టు చర్యలను అదుపు చేయాలి

రాష్ట్రంలో సమర్థవంతమైన ఇంటిలిజన్స్ వ్యవస్థ, పటిష్టమైన శాంతిభద్రతల పరిరక్షణలేదని హైదరాబాద్‌లో లుంబినీపార్క్, గోకుల్‌చాట్, మక్కామసీద్‌లపై టెర్రరిస్టుల దాడి తాజాగా దిల్‌షుక్‌నగర్ బాంబు పేలుళ్ళు ఋజువుచేసింది.

రాష్ట్ర పురోభివృద్ధికి, శాంతి,భద్రతలకు సవాలుగా మారిన ఉగ్రవాదాన్ని అంతం చేయటానికి ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలతో కూడిన సమన్వయ సంఘం రాష్ట్రస్థాయిలో, జిల్లా స్థాయిలో కూడా ఏర్పాటు చేయాలి.

రాష్ట్రంలో ఫ్యాక్షనిజం ఉన్న ప్రాంతాలలో ప్రత్యేక శాంతి సంఘాలు ఏర్పాటు చేయాలి. అక్రమ ఆయుధాలు కలిగి, నేరచరిత్రలున్న వారిని అదుపులో ఉంచాలి. గూండాలు, ముఠాలను

రాజకీయాలలోకి ఆహ్వానించకూడదు. మత సామరస్యత పెంపొందించేందుకు సర్వమత శాంతియాత్రలు నిర్వహించాలి.

## రాజకీయ ఖైదీలు

అయిదు సంవత్సరాలకు పైగా జైలులో మగ్గుతున్న రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలి. జైళ్ళ సంస్కరణలలో భాగంగా శుభ్రమైన ఆహారం, అన్నిరకాల మందుల సౌకర్యం కల్పించాలి. జైలులో పరిశుభ్ర వాతావరణాన్ని కల్గించాలి. జైళ్ళు రాజకీయాలకు అతీతంగా ఉండాలి. అలాగే హెచ్ఐవి, ఎయిడ్స్, క్షయలాంటి దీర్ఘకాల వ్యాధుల బాధితులను వెంటనే విడుదల చేయాలి. సంవత్సరాల తరబడి కేసులు కొనసాగకుండా కోర్టులకు వెళ్ళే ఖైదీలకు విధిగా ఎస్కార్టులను ఏర్పాటు చేయాలి. ఎస్కార్టుల జాప్యంవల్ల అనేకమంది ఖైదీలు సంవత్సరాల తరబడి జైలులో మగ్గడం జరుగుతున్నది. అలాగే జైలులోకి మద్యం, డబ్బులు, సెల్‌ఫోన్లు కూడా చేరుతున్నట్లుగా వార్తలు రావడం జరుగుతున్నవి. జైళ్ళ వ్యవస్థను పటిష్టవంతం చేయాలి.

## నక్సలైట్లు

నిరుద్యోగం వల్ల నిరాశా, నిస్పృహలకు గురయిన యువతరం విసిగి, వేసారి తీవ్రవాదం వైపు ప్రభావితులవుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో భూసమస్య పరిష్కారం కాకపోవడం, భూస్వాముల పెత్తందారీ పోకడలు, అంటరానితనం కొనసాగడం, పోలీసు వ్యవస్థ కొద్దిమేరకు మారినా ఇంకా వారి జులుం వల్ల యువతరం నక్సలైట్లుగా మారుతున్నారు. అన్నం పెడితే పోలీసులు పెట్టకపోతే నక్సలైట్ల బెడద గ్రామీణ ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేయడం జరుగుతున్నది.

ఈనేపథ్యంలో ముందుగా భూసమస్య పరిష్కారం కావాలి. నిరుద్యోగ సమస్య తీవ్రతను తగ్గించాలి. నక్సలైట్ల సమస్యను శాంతిభద్రతల సమస్యగా కాకుండా సామాజిక రాజకీయ ఆర్థిక సమస్యగా పరిగణించాలి. నేపాల్ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని నక్సలైట్లు సైతం వామపక్ష ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకు జనజీవన స్రవంతిలో చేరాలి.

అయితే జనజీవన స్రవంతిలో చేరుతున్న నక్సలైట్లకు ఇచ్చిన హామీల మేరకు పునరావాస కార్యక్రమాలు చేపట్టాలి. చేసిన వాగ్దానాలను అమలుపరచని పక్షంలో ప్రభుత్వ హామీలకు విశ్వసనీయత కోల్పోయి మళ్ళీ వాళ్ళు నక్సలైట్లుగా మారే అవకాశాలున్నాయి. బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపాలి. గిరిజన ప్రాంతాల్లో పోలీసు క్యాంపులు ఎత్తి వేయాలి.

## స్థానిక సంస్థలు

స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లు, జిల్లా పరిషత్, మండల పరిషత్‌లకు భారత రాజ్యాంగం 73, 74 సవరణల ద్వారా సంక్రమించిన అధికారాలు, విధులు, నిధులు, సిబ్బంది, ప్రణాళికలకు సంబంధించిన అన్ని



అంశాలను బదిలీచేసి రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫార్సులకు చట్టబద్ధత కల్పించి, స్థానిక ప్రజాపరిపాలనా వ్యవస్థను పటిష్టం చేయాలి. అధికార వికేంద్రీకరణ ద్వారా మౌలిక సదుపాయాలను కల్పించి అలాగే కేంద్రం ఈ సంస్థలకై కేటాయించిన నిధులను ఇతరత్రా బదిలీ చేయరాదు.

## వైద్యం

ప్రైవేటు రంగంలో వైద్యాన్ని ప్రోత్సహిస్తూ, కార్పోరేట్ మయం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులలో నాసిరకం మందులు, అలాగే పరికరాలు సరిగా లేనందున, సౌకర్యాలు లభ్యం కానందున ప్రభుత్వ వైద్యంపై ప్రజలు విసిగి పోయారు. కాంట్రాక్టు వైద్యులను ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రోత్సహించటం జరుగుతున్నది. ప్రైవేటు కళాశాలలు నాణ్యతను పాటించకపోవడం వల్ల అందులో విద్యనభ్యసించిన డాక్టర్లు రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

- ప్రతి 30వేల జనాభాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తెరవాలి.
- వైద్య, విద్య, ఆరోగ్య రంగాల ప్రైవేటీకరణ ఆపాలి.
- మందుల కొనుగోలు నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రులకు నిధులు కేటాయించాలి.
- ఖాళీలను సత్వరం భర్తీ చేయాలి. తాత్కాలిక ఉద్యోగుల సర్వీసులు రెగ్యులరైజ్ చేయాలి.
- కార్పోరేట్ ఆసుపత్రులలో 50% సేవలు పేదలకు ఉచితంగా అందించాలి.
- మురుగు కాల్వలలో పూడిక తీయించి, మురికి నీరు సక్రమంగా, అడ్డులేకుండా వెళ్ళేట్లు చూడాలి.
- దోమల నివారణకు ఫాగ్ యంత్రాలను కొనుగోలు చేయాలి.
- అన్ని రకాల వైద్య పరీక్షలను ఉచితంగా ప్రభుత్వ వైద్యశాలల్లో చేయాలి.
- ప్రభుత్వమే ప్రజలందరికి ఆరోగ్య సదుపాయాలు కల్పించాలి.
- పరిశుభ్రమైన త్రాగునీరు అందరికి అందించే సదుపాయం ప్రభుత్వమే చేయాలి.
- ప్రజలందరికి మరుగుదొడ్లు నిర్మించాలి.
- గర్భిణి స్త్రీలు, పిల్లలకు పౌష్టికాహారం లోపం లేకుండా చూడాలి. విద్యా వైద్య ఆరోగ్య రంగాలను ప్రభుత్వమే నిర్వహించాలి.
- అత్యవసర మందులు ప్రభుత్వమే ఉచితంగా అందచేయాలి.
- ఆరోగ్యశ్రీని అన్ని రకాల జబ్బులకు వర్తింపచేసి 108,104 సర్వీసులను పటిష్టంగా అమలు చేయాలి.
- కార్పోరేట్ హాస్పిటల్స్‌లో ప్రవేశ సందర్భాలలో పెద్ద మొత్తం డబ్బు చెల్లించాలనే ఒత్తిళ్ళను సుప్రిం కోర్టు ఆదేశాల మేరకు ఆపాలి. కార్పొరేట్ హాస్పిటల్స్‌లో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సి.జి.హెచ్.ఎస్) అమలు చేయాలి.

## చిట్ ఫండ్‌లను ఇతర ఫైనాన్స్ సంస్థలను నియంత్రించాలి

- జాతీయయం చేయబడిన బ్యాంకుల ద్వారా డిపాజిట్‌దారులకు అతి స్వల్ప వడ్డీ అందుతున్న కారణంగా పేద ప్రజలు, మధ్య తరగతి ప్రజలు అధిక వడ్డీ ఆశకు ప్రైవేటు కో ఆపరేటివ్ బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు, చిట్‌ఫండ్ కంపెనీలలో తమ పొదుపు మొత్తాలను దాచుకోవడం జరుగుతున్నది. కాని రాత్రికి రాత్రి ఈ కంపెనీలు దివాళా తీసి బిచానా ఎత్తివేయడం జరుగుతున్నది. ప్రజల డబ్బులను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. రిజర్వు బ్యాంకు, రిజిస్ట్రార్ ఆఫ్ కో ఆపరేటివ్ సొసైటీల నియామకాలను ఉల్లంఘిస్తున్న ద్రవ్య సంస్థలపై నిఘా ఉంచి, ఇలాంటి సందర్భాలలో వాళ్ళ ఆస్తులను జప్తు చేయాలి. ప్రజల డిపాజిట్‌లు కాపాడాలి.

## భవిష్యత్ రాజధాని

- భవిష్యత్ రాజధాని అన్ని జిల్లాలకు అనుకూలమైన ప్రదేశంలో ఉండాలి. హైదరాబాద్‌ను దృష్టిలో పెట్టుకొని గత అనుభవాల దృష్ట్యా వికేంద్రీకరణ దిశలో అభివృద్ధి జరగాలి.
- రాజధాని నగరం కాలుష్యరహితంగా నిర్మించబడాలి. పార్కులు, గ్రీన్ బెల్టులు, లైబ్రరీలు, సబ్‌వేలు,ఫుట్ వే బ్రిడ్జిలు నిర్మించాలి.

## సహకార రంగ వ్యవస్థను కాపాడుకోవాలి

రాష్ట్రంలో సహకార రంగాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. శతాబ్దకాలం పైగా విశేష సేవలందించిన సహకార రంగాన్ని పటిష్ట పరచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. జాతీయం చేయబడిన బ్యాంకుల ద్వారా సన్నకారు, మధ్య తరగతి రైతాంగానికి స్వల్ప వడ్డీతో అప్పులిచ్చి ఆదుకోవాల్సి ఉండగా, లక్షా యాభై వేల కోట్ల రూపాయలను గుత్తపెట్టుబడిదారులకిచ్చి వసూలు చేయలేక పోగా వడ్డీతో కలిపి మూడు లక్షల కోట్లకు చేరుకొన్న ఇంత పెద్ద మొత్తాన్ని నిరర్ధక ఆస్థులుగా ప్రకటించడం జరిగింది. అనేక కష్ట నష్టాలకోర్చి శ్రమిస్తున్న రైతన్నను ఆదుకోవడానికి ఉద్దేశించబడిన వ్యవసాయ సహకార బ్యాంకులకు 15 వేల కోట్ల రూపాయలు ఇచ్చిన ప్రభుత్వం ఆదాయపుపన్ను వసూలు పేరిట వాటిని నష్టాల ఊబిలోకి దింపడం జరుగుతున్నది. ఇలాంటి వ్యవసాయ సహకార బ్యాంకులను కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి.

## మీడియా

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఫోర్త్ ఎస్టేట్‌గా పరిగణించే మీడియా రంగ ప్రతిష్టను కాపాడాలి. పత్రికా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆపాలి. పత్రికా స్వేచ్ఛను కాపాడాలి. జర్నలిస్టులు, ఫోటో గ్రాఫర్‌లు, కెమెరామెన్‌లపై జరుగుతున్న దాడులను అరికట్టాలి.

## హోంగార్డుల సమస్యలు

ప్రతి విభాగములో అనగా లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్స్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్స్, క్రైం బ్రాంచి, సిఐడి స్పెషల్ బ్రాంచి, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విమెన్ ప్రొటెక్షన్ సెల్, విజిలెన్స్



ఎన్‌ఫోర్స్‌మెంటు, ఫైర్, ఎసిబి, ఆర్టీసి, ఎయిర్‌పోర్టు, యస్‌బిఐ మరియు అనేక ఇతర ప్రభుత్వ శాఖలలో హోంగార్డులు డ్యూటీలు చేస్తున్నారు.

హోంగార్డులు నక్సల్స్‌వేటలో పాల్గొని, ప్రాణాలు కోల్పోయినవారెందరో ఉన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జరిగిన దాడుల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. హోంగార్డులకు సంబంధించి ఈ క్రింది సమస్యలు పరిష్కరించాలి.

- పోలీసు కానిస్టేబుల్ సెలక్షన్‌లో హోంగార్డులకు ప్రత్యేక పరీక్ష నిర్వహించి, సినియారిటిని బట్టి ఉద్యోగం ఇవ్వాలి.
- పదవ తరగతి పాస్ అయిన వారికి, 40 సంవత్సరములు లోపు వయస్సు ఉన్నవారికి కానిస్టేబుల్ ట్రైనింగ్ ఇప్పించి నియమించాలి.
- హోంగార్డులను నాల్గవ తరగతి కేటగిరి క్రింద రెగ్యులైజేషన్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలి.
- పిఎఫ్ మరియు కమ్యూటేషన్‌తో కూడిన పెన్షన్ సౌకర్యం కల్పించాలి.
- ఎన్‌జిఒలకు మాదిరిగా బస్ పాస్ సౌకర్యం కల్పించాలి.
- వారం రోజులలో ఒక రోజు సెలవు ఇవ్వాలి.
- డ్యూటీలో చనిపోయిన హోంగార్డుల కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకొని, ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి.
- మహిళా హోంగార్డులకు డెలివరి సమయంలో 60 రోజులపాటు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలి.
- హోంగార్డులకు సమగ్రమైన చట్టాన్ని రూపొందించాలి.

## ఇతరములు

- పోలీసు శాఖలో పని చేస్తున్న ప్రతి పోలీసు అధికారి నుండి మొదలుకొని కానిస్టేబుల్ వరకు 8 గంటల పని కాలం అమలు చేయాలి. అధిక గంటలు పని చేసిన వారికి ఓవర్ టైం అలవెన్సులు ఇవ్వాలి.
- గల్ఫ్ బాధితులు మరియు ప్రవాసాంధ్రుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలి.
  ప్రత్యేక ప్యాకేజి ప్రకటించాలి.
- అర్హులైన స్వాతంత్ర్య సమరయోధులకు పెన్షన్లు మంజూరు చేయాలి.
- ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ఒక వృద్ధాశ్రమం నెలకొల్పాలి.
- మానవ హక్కుల కమీషన్ ఇచ్చిన తీర్పులను అమలు పరచాలి.
- పెండింగ్‌లో ఉన్న అనేక కేసులను పరిష్కరించేందుకు గాను కొత్త కోర్టులను ఏర్పాటు చేయాలి.
- ఫ్లై ఓవర్లు, ఫుట్ వే బ్రిడ్జిలు, సబ్‌వేలు అన్ని పట్టణాలలో, నగరాలలో నిర్మించాలి.

- కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీసులను క్రమబద్ధీకరించాలి.
- వికాలంగులకు, వృద్ధులకు, వితంతువులకు 2500 రూ॥ల పెన్షన్ చెల్లించాలి.
- నిరక్షరాస్యత నిర్మూలనా కార్యక్రమం చేపట్టాలి.
- వయోజన విద్యకై పాఠశాలలు తెరవాలి.
- ప్రధానంగా బాలికల విద్యను ప్రోత్సహించాలి.
- రాష్ట్రంలో టెలివిజన్ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం టివినగర్ కోసం 50 ఎకరాల స్థలాన్ని కేటాయించాలి.
- నిర్మాతలకు సబ్సీడీలు అందించాలి.
- స్టూడియోలు, ప్రొడక్షన్ హౌస్‌లు నిర్మించడానికి ఉచితంగా స్థలాలు మంజూరు చేయాలి.
- డబ్బింగ్ సీరియల్స్‌పై నిషేదం విధించాలి.
- భూగర్భ డ్రైనేజి వ్యవస్థను అన్ని మండల కేంద్రాలలో ప్రారంభించాలి.
- నేరస్థులకు, అవినీతిపరులకు అన్ని రాజకీయ పార్టీలు టికెట్లను తిరస్కరించాలి.
- రాష్ట్రంలో మండలానికొక పాలిటెక్నిక్, ఐటిఐలను ఏర్పాటు చేయాలి.
- జల, వాయు, శబ్ద కాలుష్యాలను నివారించాలి.
- కాలుష్య నియంత్రణ మండలి ఖచ్చితంగా కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలి.
- రాష్ట్ర వ్యాపితంగా గ్రీన్‌బెల్ట్‌లను ప్రోత్సహించాలి.
- విదేశాల్లోను, ఆంధ్ర ప్రదేశ్‌లోను ఉద్యోగాలు కోల్పోయిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు ఉద్యోగావకాశాలు కల్పించాలి.
- ప్రతి గ్రామ పొలిమేరల్లో స్మశాన వాటికలను నిర్మించాలి. దీనికై 2 నుండి 5 ఎకరాల స్థలాన్ని కేటాయించి, నీటి సౌకర్యం ఇతర సౌకర్యాల నిమిత్తం 20 లక్షల రూపాయలను కేటాయించాలి.
- బంగారు తల్లి పథకం పేరిట విస్తృత ప్రచారాన్ని చేస్తున్నది. కానీ దానికి భిన్నంగా అమలు ప్రక్రియ కొనసాగుతున్నది. బాలిక చిన్న వయస్సులో ఒక లక్ష రూపాయలు డిపాజిట్ చేసి, పెళ్లి నాటికి పది లక్షల రూపాయలు అందించాలి. ప్రతి సంవత్సరం చదువు కొరకు అవసరమైన మొత్తాన్ని చెల్లించాలి.
- ఎస్‌సి, ఎస్‌టిలకు 50 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చి, అమలు చేయడం లేదు. వీరికి కనీసం 100 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలి.
- ఇళ్ళులేని వారికి ఇళ్ళ స్థలాలు ఇవ్వాలి. గుడిసెవాసులకు పక్కా ఇండ్లు కట్టించి ఇవ్వాలి. బలహీనవర్గాలకు పక్కా ఇళ్ళ నిర్మాణానికి మూడు లక్షల రూపాయలు కేటాయించాలి.

# కంకి కొడవలి
# గుర్తుకే మీ ఓటు

## సి.పి.ఐ. అభ్యర్థులను
## గెలిపించండి

ప్రతులు: 5000